
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 7 జనవరి 2025





చూడగలిగెనే రాముని
సుందర రూపం

- నిజరూప అవతారాన్ని తిలకించి పులకించిన భక్తజనం
- కన్నులపండువగా తిరువీధి సేవ
- కేరళ వాయిద్యం, బుట్టబొమ్మల ప్రదర్శన, కోలాటాలతో సందడి

భద్రాచలం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారు రామావతారంలో భక్తులకు దర్శనమివ్వగా తిలకించిన భక్తులు పులకరించారు. స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి రామావతారాన్ని అందంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణ, బాజభజంత్రీలు, కేరళవాయిద్యం, బుట్టబొమ్మల ప్రదర్శన,మహిళ భక్తుల కోలాటాల నడుమ స్వామివారిని మిథిలాస్టేడియ ప్రాంగణంలోని అధ్యయనోత్సవ వేదికవద్దకు తీసుకొచ్చారు. ఈ సమయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారికి నివేదన చేశారు. వైకుంఠ రాముడిగా తన నిజ రూపావతారంలో దర్శనమిచ్చిన రామయ్యను భక్తులు తిలకించి తరించారు. అనంతరం స్వామి వారిని తిరువీధి సేవకు తీసుకెళ్లారు. మంగళవారం స్వామి వారు బలరామావతారంలో దర్శనమివ్వనున్నారు. కాగా, నిజ రూప దర్శనంలో దర్శనమిచ్చిన రామయ్యను జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్‌లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వారిని ఆశీర్వదించారు.

రా.. రమ్మని..



భద్రాచలంలో గిరిజన మ్యూజియం



భద్రాచలంలో గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన క్యాంపింగ్ లివింగ్ రూమ్స్

నదీ తీరం..
పర్యాటక హారం..

- భద్రాద్రిలో గోదావరి నది చెంతన పూర్తయిన ఏర్పాట్లు
- వెదురు బొంగులు, తడికెలతో క్యాంపింగ్ లివింగ్ రూములు
- సెల్ఫీ పాయింట్లు, గిరిజన స్టాల్స్
- ముస్తాబైన గిరిజన మ్యూజియం
- ముక్కోటికి వచ్చే భక్తులకు అదనపు ఆకర్షణ
- మూడు రోజుల ప్యాకేజీకి రూపకల్పన
- ఈ నెల 9 నుంచి పర్యాటకులకు అందుబాటులోకి...
- రెండు నెలల పాటు నిర్వహించాలని ప్రణాళిక
- తెప్పోత్సవం రోజున ఏరు పండుగ

భద్రాచలం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా పర్యాటకరంగం కొత్త హంగులు సంతరించుకుంటోంది. పర్యాటకులను ఆకట్టుకునేలా అధికార యంత్రాంగం రివర్ ఫెస్టివల్‌కు రంగం సిద్ధం చేసింది. ఇందుకు భద్రాద్రి రామయ్య చెంతన గల గోదావరి నదీ తీరంతో పాటు ఇతర సమీప ప్రాంతాలు వేదిక కానున్నాయి. ఒక ప్యాకేజీ రూపంలో ఈ రివర్ ఫెస్టివల్‌ను అనుభూతి చెందేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రత్యేక చొరవతో ఈ ఫెస్టివల్‌కు శ్రీకారం చుట్టారు. నిత్యం దీనిపై క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యాటకులను ఆకట్టుకునే ప్రదేశాలను గుర్తించడంతో పాటు, అక్కడ పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఏర్పాట్లు ఏ విధంగా ఉండాలి అనే దానిపై సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ వచ్చారు.

ముఖ్యంగా భద్రాచలంలో గోదావరి నదీ తీరాన పర్యాటకులు సేద తీరేందుకు వెదురు బొంగులు, తడికెలు, ఇతర కలపతో విడిదిలు (క్యాంపింగ్ లివింగ్ రూమ్స్) ఏర్పాటు చేయడం విశేషం. భోజనశాల సైతం వెదురు తడికెలు, చెక్క, బద్దలతో నిర్మించారు. పూర్తిగా గ్రామీణ వాతావరణం ఉట్టిపడుతూ ప్రాచీన నాగరిక సమాజం గుర్తుకు వచ్చేలా ఏర్పాటు చేశారు. చివరకు విద్యుత్ దీపాల ఏర్పాటులో సైతం సోలార్ విద్యుత్ వినియోగిస్తుండటం గమనించదగ్గ విషయం. ఆధునిక పోకడలకు వెళ్లకుండా ఏజెన్సీలోని గ్రామాల్లో సాధారణ ప్రజలు ఏ విధంగా నివసిస్తారో అదే రీతిలో ఏర్పాట్లు చేశారు. కాగా పర్యాటకుల కోసం (మిగతా 6వ పేజీలో)



భద్రాచలంలో సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్, ఎస్పీ, ఏఎస్పీ

మూడు రోజుల ప్యాకేజీ

మొదటి రోజు

వివిధ ప్రాంతాలనుంచి భద్రాచలం చేరుకునే భక్తులు, పర్యాటకులు తొలుత రామయ్యను దర్శించుకుంటారు. అనంతరం గిరిజన మ్యూజియాన్ని సందర్శిస్తారు. ఈ సమయంలో గిరిజన వంటకాలు, అడవుల్లో లభించే వివిధ రకాల పండ్లు రుచి చూస్తారు. గోదావరి నదీ తీరాన ఏర్పాటు చేసిన విడిదిలో సేద తీరుతారు.

రెండో రోజు

భద్రాచలం నుంచి కిన్నెరసాని బోటింగ్‌కు వెళ్లి జలవిహారం చేస్తారు. అనంతరం దుమ్ముగూడెం మండలం బొజ్జిగుప్పను సందర్శించి అక్కడ ఆదివాసీలతో మమేకమై క్యాంప్ ఫైర్‌లో పాల్గొంటారు. గిరిజనుల నృత్యాలు, పాటలతో ఆహ్లాదకరంగా గడుపుతారు. మళ్లీ రాత్రికి భద్రాచలం గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన విడిది(క్యాంపింగ్ లివింగ్ రూములు) వద్దకు చేరుకొని బస చేస్తారు.

మూడో రోజు

చంద్రుగొండ మండలంలోని బెండాలపాడుకు ట్రెక్కింగ్ కోసం వెళ్తారు. దీంతో పర్యాటక యాత్ర ముగుస్తుంది. భద్రాచలం, కిన్నెరసాని, బొజ్జిగుప్ప, బెండాలపాడులో టూరిస్టులకు భోజనాలు అందుబాటులో ఉంటాయి.

నేడు భట్టి రాక

ఎర్రుపాలెం మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ఎర్రుపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎర్రుపాలెం మండలంలో డిప్యూటీ మల్లు భట్టి విక్రమార్క మంగళవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఎర్రుపాలెం, మీనవోలు, రామచంద్రాపురం, పెగళ్లపాడు, తెల్లపాలెం కంద్రిక గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఎర్రుపాలెంలో రూ.18కోట్ల నిధులతో నిర్మించనున్న ఆర్‌అండ్‌బీ డివైడర్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు.

జిల్లా ఆస్పత్రికి
రూ.8 లక్షలు

ఎంపీ నిధుల నుంచి కేటాయింపు

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి తన ఎంపీ కోటా నిధుల నుంచి రూ.8లక్షలను కేటాయించారు. ఆయన గతంలో ఆస్పత్రి సందర్శనకు వచ్చినప్పుడు మార్చురీని సందర్శించారు. మార్చురీలో ఏసీ బాక్సులు లేకపోవడం మూలంగా మృతదేహాలు దుర్వాసన వస్తున్నాయంటూ పలువురు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన స్పందించి తన నిధులను కేటాయిస్తానంటూ హామీ ఇచ్చారు. హామీ మేరకు సోమవారం తన నిధుల నుంచి రూ.8లక్షలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీ బాక్సులను కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు.

రూ.2కోట్ల విలువైన గంజాయి దహనం

తల్లాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లాలోని మూడు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పట్టుబడిన రూ.రెండుకోట్ల విలువైన గంజాయి, డ్రగ్స్‌ను సోమవారం తల్లాడ మండలం గోపాలపేటలోని ఏడ బ్యూఎం బర్నింగ్ ప్లాంట్‌లో కాల్చివేశారు. జిల్లాలోని ఖమ్మం, మధిర, నేలకొండపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 91కేసుల్లో పట్టుబడిన 831కిలోల గంజాయి, 11 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను కాల్చివేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి.జనార్ధన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్, డీసీవో నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నష్టాల ఘాటు



మిగిలింది తాలే

- నమ్ముకున్న రైతును నట్టేట ముంచుతున్న 'ఎర్ర బంగారం'
- వైరస్‌తో ఎండిపోతున్న మిర్చి పంట
- దక్కని గిట్టుబాటు ధర.. పెట్టుబడులూ రాని పరిస్థితి..
- కన్నీరుమున్నీరవుతున్న రైతులు

ముదిగొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కష్టాల ఘాటుతో మిర్చి రైతులు సతమతం అవుతున్నారు. నష్టాలతో కన్నీళ్లు కారుస్తున్నారు. ఎర్ర బంగారంగా పేరుగాంచిన మిర్చి పంట సాగు కోసం లక్షల రూపాయలు అప్పులు చేసి, ఎంతో ఆశతో సాగుచేసిన మిర్చిపంట తెగుళ్ల సోకి తాలే మిగిల్చిందని ఆవేదన చెందుతున్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలో 2287ఎకరాల్లో రైతులు మిర్చి పంట సాగుచేశారు. నాటిన మొక్కలు అధిక వర్షాలతో కుళ్లిపోవడంతో రెండు, మూడుసార్లు వ్యయప్రయాసలకోర్చి మిర్చి పంట సాగు చేపట్టారు. ఎకరాకు మిర్చి సాగుకు విత్తనాలు, నారుకు రూ.40వేల వరకు ఖర్చు కాగా, ఎరువులు, పురుగుమందులు, అరక, కూలీలతో రూ.90వేల వరకు ఖర్చు వచ్చిందని రైతులు చెబుతున్నారు. మిర్చి సాగుతో ఎకరాకు 30క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉండగా ఈ ఏడాది కేవలం నాలుగు నుంచి ఐదు క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

ఎండుతెగుళ్లతోపాటు తామర పురుగుపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించినా తెగుళ్ల నివారణకు పలుమార్లు క్రిమిసంహారకమందులు పిచికారి చేసినా తెగుళ్ల బెడద వదల్లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్లతోపాటు పంట దెబ్బతిన్నదని, కనీసం ఉన్న పంట ఎకరాకు పది క్వింటాళ్లు కూడా (మిగతా 6వ పేజీలో)

సలహాలు పాటించినా ఫలితం లేదు



కొమ్మూరి రమేష్, రైతు, ముదిగొండ

ఈ ఏడాది మూడెకరాల్లో మిర్చిపంట సాగుచేశాను. పూత, కాత దశలోనే చేతికొచ్చిన పంట ఎండిపోతుంది. శాస్త్రవేత్తలు, అధికారులు సలహాలు, సూచనల పాటించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ఎకరాకు రూ.1.20లక్షలు ఖర్చుపెట్టా. తీరా పెట్టుబడి కూడా రాదు. ఈ ఏడాది మొత్తం నష్టమే. వైరస్‌లను కట్టడిని చేయలేకపోతే వ్యవసాయం కష్టమే.

12,30,572

ఖమ్మం జిల్లా తాజా ఓటర్ల సంఖ్య

- పురుషులు 5.92 లక్షలు..
- మహిళలు 6.37 లక్షలు..
- కొత్త చేర్పులతో తేలిన మొత్తం ఓటర్ల సంఖ్య
- మహిళా ఓటర్లే అధికం
- తుది జాబితా విడుదల చేసిన అధికారులు



ఖమ్మం కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో 12,30,572 మంది ఓటర్లతో తుదిజాబితాను జిల్లా అధికారులు సోమవారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో తహసీల్దారు కార్యాలయాల్లో ఓటర్ల జాబితాను ప్రదర్శనకు పెట్టనున్నారు. ఈ జాబితాలో జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారికి చోటు కల్పించారు. అక్టోబరు 29న ముసాయిదా జాబితాను ప్రకటించగా అప్పుడు 12,27,230 మంది ఓటర్లు ఉన్నారు. ఆ తర్వాత ఓటర్ల నమోదు ప్రక్రియలో 8582 దరఖాస్తులు కొత్తవి రాగా 5240 దరఖాస్తులను (మృతులు, వలసలు ఇతరత్రా కారణాలతో) తొలగించారు. తాజాగా 12,30,572తో తుది జాబితాను ప్రకటించారు. ఈ సందర్భంగా తుది జాబితాను ప్రకటించినప్పటికీ ఓటరుగా నమోదుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందన్నారు.

ఏడాదికి నాలుగు సార్లు ఓటర్ల జాబితాను సవరించనున్నట్లు అధికారులు తెలిపారు. నూతనంగా రూపొందించిన ఓటర్ల జాబితాను అన్ని పోలింగ్ (మిగతా 6వ పేజీలో)

ఖమ్మం జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

	మొత్తం	పురుషులు	స్త్రీలు	ఇతరులు
ఖమ్మం	3,24,234	1,55,326	1,68,859	49
పాలేరు	2,42,888	1,16,655	1,26,225	8
మధిర	2,23,365	1,07,550	1,15,805	10
వైరా	1,94,540	94,196	1,00,340	4
సత్తుపల్లి	2,45,545	1,19,073	1,26,455	17

కాల్వొడ్డు మున్నేరు వంతెన బంద్

ప్రత్యామ్నాయంగా చప్టా పునరుద్ధరణ



ఖమ్మం కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కాల్వొడ్డు సమీపంలోని మున్నేరు వంతెనపై రాకపోకలను సోమవారం సాయంత్రం నుంచి నిలిపి వేశారు. తీగల వంతెన పనులు కొనసాగుతున్న నేపథ్యంలో పాత బ్రిడ్జిపై రాకపోకలను నిలిపివేసి ప్రత్యామ్నాయంగా ఏటిలో పాత చప్టాను పునరుద్ధరించారు. ఏటిలో రోడ్డుకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి బీటీ వేశారు. దాన్ని సోమవారం సాయంత్రం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో ఇక్కడ రద్దీ పెరిగింది. ఇప్పటికే ఈ వైపుగా ఆర్టీసీ బస్సులను, భారీ వాహనాలను బైపాస్ రోడ్డు మీదుగా మళ్లించిన విషయం విధితమే. అయితే సస్పెన్షన్ బ్రిడ్జి పూర్తయ్యేంత వరకు ట్రాఫిక్‌ను ఏటిలో నుంచి కొనసాగించనున్నట్లు వర్షాకాలం నాటికి పనులను పూర్తి చేయనున్నట్లు అధికారులు చెప్పారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి.బాల మాయదేవి 6

'కొత్త' కొత్తగా ఉంటది..

నగరపాలక సంస్థ ఏర్పాటుతో కొత్తగూడెం అభివృద్ధికి బాటలు



7

కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ ఏర్పాటుతో అభివృద్ధి ఊపందుకునేందుకు బాటలు పడనున్నాయి. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతోపాటు సుజాతనగర్ మండల కేంద్రం, మరో ఏడు గ్రామ పంచాయతీలను కలిపి కార్పొరేషన్‌గా ఏర్పాటుచేసిన విషయం విదితమే. ఇప్పటికే పారిశ్రామిక ప్రాంతంగా గుర్తింపు ఉన్న కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు... నగరపాలక సంస్థకు వెల్లువెత్తే నిధులతో సరికొత్త రూపును సంతరించుకోనున్నాయి. ప్రజలకు మౌలిక, అధునాతన వసతులు అందుబాటులోకి రానున్నాయి. వివిధ పనులకు ఇప్పటికే నిధుల వరద మొదలైంది. - ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం

జీవం ఉట్టిపడేలా..

- చిత్రలేఖనంలో రాణిస్తున్న ఉదయ్‌శ్రీ
- చదువుల్లోనూ ముందంజ

మణుగూరు టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కళలు వినోదాన్ని అందించడమే కాదు విజ్ఞానాన్ని పంచుతాయి. అరవై నాలుగు కళల్లో తాను నేర్చుకున్న చిత్ర లేఖనంతో ప్రజలను ఆశ్చర్యచకితులను చేయవచ్చని నిరూపించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం కొండాయిగూడెం గ్రామానికి చెందిన దాచేపల్లి శ్రీనివాసరావు, జ్యోతిల చిన్న కుమార్తె ఉదయశ్రీ చిత్రలేఖనంలో చక్కని ప్రతిభను కనబరుస్తూ పలువురి మన్ననలను పొందుతోంది. చదువుల్లోనూ అగ్రస్థానంలో రాణిస్తోంది. 10వ తరగతిలో 9.7జీపీఏ సాధించింది. హైదరాబాద్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో చేరి ప్రథమ స్థానంలో పాసైంది. బీటెక్‌లోనూ ప్రథమ శ్రేణి మార్కులను సాధించింది. చిన్నప్పటినుంచి చిత్రలేఖనంపై మక్కువ ఉండటంతో గురువు లేకుండానే ఈ విద్యను నేర్చుకుంది. వాటర్ కలర్లు పోస్టల్ పెయింటింగ్‌లలో కాలుష్య భూతం, పల్లె పడుచు, పలువురిని ఆకట్టుకున్నాయి. మండల స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో ప్రథమ బహుమతిని పొందింది. కొత్తగూడెం బాలోత్సవం, సింగరేణి డే, భద్రాద్రి బాలోత్సవంలాంటి అనేక ఈవెంట్స్‌లో పాల్గొని ప్రతిభను చాటుకోంది. హైదరాబాద్‌లో ఉమెన్స్ ట్రాఫీ కింగ్ థీమ్‌పై వేసిన డ్రాయింగ్‌కు ప్రత్యేక ప్రశంసలు లభించాయి.






చిత్రలేఖనంలో అధునాతన సాంకేతికతను వినియోగించి సోషల్ మీడియాలో ఆర్ట్ విచ్ 6 పేరుతే ఖాతాలు చేసి చిత్రాలను గీస్తుంది. తన ఇన్‌స్ట్రాగ్రామ్ ఖాతాను సుమారు 20వేల మంది ఫాలో అవుతున్నారు. తన యూట్యూబ్ ఖాతాలో 10కె మంది ఖాతాదారులు ఉన్నారు. ఉదయ శ్రీ వేసిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చిత్రాన్ని డ్రాయింగ్ వేసి పలువురు నుంచి అభినందనలు పొందింది. తల్లి దండ్రుల ప్రోత్సాహంతో చిత్రలేఖనంలో చక్కని ప్రతిభను కనబరుస్తూ ఈ కళపై ఆసక్తి ఉన్న అనేక మందికి శిక్షకురాలిగా మారింది.

ఉదయశ్రీ.. తాను నేర్చుకున్న కళనుపది మందికి పంచాలని దృఢ సంకల్పంతో ఇంటి నుంచే శిక్షణ ఇస్తున్నాను. ప్రస్తుతం చార్‌కోల్ అండ్ గ్రాఫైట్ డ్రాయింగ్ ఆర్కిలిక్ పెయింటింగ్ నేర్చుకుంటున్నాను. చిత్రలేఖన స్టూడియోను నిర్మించి అనేకమందికి శిక్షణ ఇస్తాను. ఈ వృత్తిలో అతితక్కువ ఫీజుతో శిక్షణ ఇవ్వాలనేది తన కలగా చెప్పారు. అంతర్జాతీయ స్థాయికి ఎదగాలనేదే తన లక్ష్యమన్నారు.







జిల్లాకు ఏ.డీ. కార్యాలయం వచ్చేనా?

ఖమ్మం, జనవరి 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో సమాచార శాఖ ఏడీ కార్యాలయం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఇంకా పరిశీలనలోనే ఉంది. జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిల సారథ్యంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సమాచారశాఖ పాత్ర కీలకంగా మారింది. ప్రస్తుతం ఖమ్మంలో డీపీఆర్వో కార్యాలయం మాత్రమే ఉంది. వాహనాలు కూడా లేవు. రేడియో ఇంజనీరింగ్ కార్యాలయం కూడా జిల్లాలో లేదు. దీంతో సమాచారశాఖ మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డికి గతేడాది జిల్లా మీడియా ప్రతినిధులు మంత్రి దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. సూర్యాపేటలో సమాచార శాఖ ఏడీ కార్యాలయం ఉందని, ఖమ్మానికి కూడా మంజూరు చేయాలని కోరడంతో మంత్రి పొంగులేటి స్పందించి ఏడీ కార్యాలయం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో

మంజూరులో జాప్యం

ప్రతిపాదన కూడా ఆర్థికశాఖకు పంపి ఏడాది గడిచిపోయినా ఇంకా కార్యాలయం మాత్రం మంజూరు కాలేదు. జిల్లాలో ముగ్గురు మంత్రులు వేర్వేరుగా పర్యటనలు జరుపుతున్న రోజు సమాచారశాఖ అధికారులు సమావేశాలకు వెళ్లడం కష్టతరంగా ఉంది. సిబ్బంది తక్కువగా ఉండడం, వాహనాలు లేకపోవడంతో మీడియాకు ఆర్టీసీ బస్సులు అద్దెకు తీసుకుని పెడుతున్నారు. గ్రామాల్లో ఇరుకురోడ్లలో బస్సులు వెళ్లలేని పరిస్థితి ఉంది. అయితే ఖమ్మంకు ఏడీ కార్యాలయం వస్తే అదనపు సిబ్బందితోపాటు వాహనాలు కూడా మంజూరయ్యే అవకాశం ఉంది. ఇటీవల జిల్లాకు వచ్చిన సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఖమ్మంలో సమాచార శాఖ ఏడీ కార్యాలయం ఎంతవరకు వచ్చిందని అడగ్గా.. ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉందని త్వరలో క్లియర్‌చేసి మంజూరు చేస్తామని తెలిపారు.

వినియోగదారులకు సత్వర సేవలు

- ఫోరమ్‌కు కేవలం ఎనిమిది వినతులే
- ఫిర్యాదులు స్వీకరించిన చైర్మన్ వేణుగోపాలచారి

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు సత్వర సేవలు అందించేందుకు విద్యుత్ వినియోగదారుల ఫోరమ్ పనిచేస్తోందని, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్ పర్సన్ ఎన్.వేణుగోపాలాచారి పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం విద్యుత్ 2 సబ్ డివిజన్ కార్యాలయంలో వినియోగదారుల ఫిర్యాదుల కోర్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిది మంది తమ సమస్యలపై వినతిపత్రాలను అందించారు. ఎస్ఈ ఏ సురేందర్, డీఈ రామారావు ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా ప్రతిష్టాత్మకమైన విద్యుత్ వినియోగదారుల కోర్టు నిర్వహణపై శాఖాపరంగా ఖమ్మం నగరంలో విద్యుత్ వినియోగదారులకు సరైన ప్రచారం కల్పించకపోవటంతో కేవలం ఎనిమిది మంది మాత్రమే వినతులు అందించారు.

పాఠశాల భవనం కోసం
ప్రజావాణిలో ఉపాధ్యాయుడు

- మూడేళ్లగా నిలిచిన పనులు

ఆళ్లపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి) అయ్యా.. మా భూ సమస్య ఉంది పరిష్కరించండి, సారు.. మా భూమి కబ్జా చేశారు.. ఇప్పించండి..? పెద్ద సారు ధరణిలో మా పేరు రాలేదు, వృద్ధాప్యంలో ఉన్న ఇంకా పెన్షన్ రావడం లేదని వారి వారి సొంత సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లాలోని నలుమూలల నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి వస్తే.. ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాత్రం కలెక్టర్ సారు మాకు పాఠశాల భవనం లేదు కట్టించండి అంటూ ప్రజావాణిలో క్యూ లైన్‌లో దరఖాస్తు పట్టుకుని నిలబడ్డాడు. ఆళ్లపల్లి మండలం, మర్కోడు ఎంపీపీఎస్ పాఠశాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మన ఊరు-మన బడిలో ఎంపిక చేసి పాత భవనాలు కూల్చారు. ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో మూడేళ్లగా పనులు మూలుగుతూనే ఉన్నాయి. వచ్చిన అధికారికల్లా విన్నవించినా అప్పటికప్పుడు ధూం ధాం చేయడం తప్ప.. ప్రయోజనం లేకుండా పోయింది. భవనాలు లేకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వర్షాకాలం అనేక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల భవనం కోసం స్థానిక రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పాల్సిన ప్రభుత్వ ఉపాధ్యాయుడే జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు.



ప్రజావాణిలో నిలబడిన మర్కోడు ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు

భగవద్గీత కంఠస్థ పోటీల్లో శ్యామలకు
బంగారు పతకం

సత్తుపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మైసూరు దత్త పీఠం ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలోని దత్తక్షేత్ర నాద యాత్ర ప్రాంగణంలో నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో పట్టణానికి చెందిన వేముల శ్యామల బంగారు పతకం గెలుచుకున్నారు. శ్రీగణపతి సచ్చిదానంత స్వామిజీ చేతులమీదుగా పతకంతో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు.



పతకం అందుకుంటున్న శ్యామల

ఈ సందర్భంగా శ్యామలను పట్టణానికి చెందిన పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

కిన్నెరసాని గెస్ట్‌హౌస్‌లను పరిశీలించిన కలెక్టర్

పాల్వంచ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిన్నెరసాని పర్యాటక కేంద్రంలో గల గెస్ట్‌హౌస్‌లను జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్ సోమవారం రాత్రి పరిశీలించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా భద్రాచలం దేవస్థానానికి విచ్చేస్తున్న అధికారుల కోసం ఇక్కడ ఉన్న గెస్ట్‌హౌస్‌లను పరిశీలించారు. గెస్ట్‌హౌస్ నిర్వహకులతో కలెక్టర్ మాట్లాడారు. అధికారులు ఉండేందుకు తగు ఏర్పాట్లు చేయాలని, ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న గెస్ట్‌హౌస్‌లోని పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు.

13న రెండు జిల్లాల స్థాయి పాటల పోటీలు

వైరా, జనవరి6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా రవళి కళానిలయం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 13న వైరాలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయిలో పాటల పోటీలు నిర్వహిస్తామని ఆట్రస్టు అధ్యక్షుడు గద్వాల రమేష్ తెలిపారు. 13వతేదీ సాయంత్రం నుంచి రాత్రి పదిగంటల వరకు సినిమా, దేశభక్తి, అభ్యుదయ పాటల పోటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆసక్తిగల గాయకులు 99486 43074కు నెంబర్‌కు ఫోన్ చేసి ఎంట్రీలు నమోదు చేసుకోవాలని సూచించారు.

మిగిలింది తాలే..

(5వ పేజీ తరువాయి)

దిగుబడి వచ్చే పరిస్థితి లేదని, దానిలో సగం మిర్చి పంట తాలే అవుతుందని వారు తెలుపుతున్నారు. కొంతమంది రైతులు తెగుళ్ల ధాటిని తట్టుకోలేక మిర్చిపంటను తొలగించి అపరాల సాగు చేపట్టారు. ఎంతో ఆశతో ఆరుగాలం కష్టించి వేలకు వేలు పెట్టుబడి పెట్టి పంట సాగుచేసినా చివరకు మిర్చి తాలై మిగిలిందని రైతులు వాపోతున్నారు. గిట్టుబాటు ధర దొరుకుతుందని మార్కెట్లకు తీసుకువెళ్లగా జెండా పాట రూ.15వేలు ధర పలుకుతుండగా, దళారులు మాత్రం రూ.12వేల నుంచి రూ.14వేల వరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. తాలు మిర్చిని రూ.4వేల నుంచి 5వేలకు కొనడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది మిర్చి క్వింటా ధర రూ.20వేలు ఉండటంతో ఎకరాకు రూ.లక్ష రాబడి ఆశించామని అయితే ఇప్పుడు రూ.లక్ష నష్టాన్ని చవిచూస్తున్నామని అన్నదాతలు పేర్కొంటున్నారు.

వైరస్‌తో మొత్తం తాలే..

● కమర్తపు వెంకటేశ్వర్లు, రైతు, ముదిగొండ



ఈ ఏడాది ఎకరంన్నరలో మిర్చిపంట సాగుచేశా. మొదట్లో కొంత ఎండిపోయింది. అధికారులు చెప్పినట్లు వేసిన మిగిలిన పంట వైరస్‌తో తాలుగా మిగిలింది. ఎకరాకు ఐదు క్వింటాళ్లు కూడా దిగుబడి రావడం లేదు. పూర్తిగా నష్టం వాటిల్లింది. గత ఏడాది మిర్చి క్వింటాకు రూ.20వేలు ఉండగా ప్రస్తుతం మార్కెట్లో రూ.15వేలు పలుకుతుంది. దళారులు రూ.12వేల నుంచి రూ.14వేలకు కొంటున్నారు. ప్రభుత్వం చొరవ చూపి మిగిలిన పంటకైనా ధర కల్పించాలి.

నదీ తీరం.. పర్యాటక హొరం..

(5వ పేజీ తరువాయి)

పది మరుగుదొడ్లను, స్నానపు గదులను సిద్దం చేశారు. ఇదిలా ఉండగా సోమవారం ఏర్పాట్లను కలెక్టరు జితేష్‌వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్‌లు పరిశీలించారు. ఈ నెల 9 నుంచి ఇవి పర్యాటకులకు అందుబాటులోకి రానున్నాయి.

ముక్కోటి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణ

ఈ ఏడాది ముక్కోటి సమయంలో ప్రత్యేక ఆకర్షణగా రివర్ ఫెస్టివల్ నిలుస్తుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. భద్రాచలంలో సోమవారం గోదావరి ఒడ్డున రివర్ ఫెస్టివల్ నిర్వహణ, ముక్కోటి, తెప్పోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ ఎస్పీ, ఎఎస్పీ, దేవస్థానం ఈవో, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులు విడిది చేసేందుకు గిరిజన సంప్రదాయాలతో ఏర్పాటు చేసిన క్యాంపింగ్ లివింగ్ రూములు , సెల్ఫీ పాయింట్లు, గిరిజన స్టాల్స్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయని తెలిపారు. అలాగే వీఐపీ, వీవీఐపీలకు వేర్వేరుగా బారికేడ్లతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు.



గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

పారిశుధ్యం విషయంలో ప్రత్యేక ప్రణాళికతో పని చేయాలని డీఎల్‌పీవో, పంచాయతీ అధికారులను ఆదేశించారు. సారపాక నుంచి భద్రాచలం వరకు ప్రత్యేక విద్యుత్తు కాంతులు వెదజల్లాలని, దేవస్థానంలో స్వామి వారి దర్శనంకు వచ్చే భక్తులకు తొక్కిసలాట జరగకుండా పోలీసు, దేవస్థానం సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాలు తెప్పోత్సవానికి ముందు ఆ తర్వాత నిర్వహించేలా చూడాలని దాంతో పాటు గిరిజన సంస్కృతికి సంబంధించిన కళాఖండాలు, గిరిజన వంటకాలు, కరక్కాయ పొడితో టీ తయారు చేయడం, ఔషధ గుణాలకు సంబంధించిన ఆహార పదార్థాల స్టాల్స్, పర్యాటకులు సందర్శించి కొనుగోలు చేసేలా చూడాలని అన్నారు. తాత్కాలిక విడిది గృహాలలో అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని వచ్చే భక్తులు ఈ గృహాలలో బస చేసి కిన్నెరసాని, బొజ్జిగుప్ప, బెండలపా డు, గిరిజన మ్యూజియంను సందర్శించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన, దేవస్థానం ఈవో రమాదేవి, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.



చంద్రుగొండ మండలం బండ్లపాడు వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్

ఏరు పండుగ

ఈ ఏడాది తొలిసారిగా ముక్కోటి సమయాన ఏరు ఫెస్టివల్‌ను జిల్లా అధికార యంత్రాంగం నిర్వహిస్తోంది. గోదావరి నదీ తీరాన ఈ నెల 9న రామయ్యకు తెప్పోత్సవం నిర్వహిస్తూనే మరో వైపు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న గిరిజన సంస్కృతి సంప్రదాయాలు, పర్యాటక అందాలను వివరించనున్నారు. మొత్తం 3 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తుండగా బెంగుళూరు నుంచి వస్తున్న ప్రత్యేక కళాకారుల బృందం సాంస్కృతిక ప్రదర్శనలను గోదావరి నదీ తీరాన ప్రదర్శించుంది. అలాగే గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులు, అల్లికలు, వారు తయారుచేసిన ప్రత్యేక వంటకాలు, వారి వేషధారణలకు సంబంధించిన 40 ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటుచేయనున్నారు. ఇదే సమయంలో గోదావరి నదీతీరంలో ప్రత్యేక సెల్ఫీపాయింట్‌ను సైతం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

- జిల్లాలో 98.15 శాతం మేర ఓటర్ కార్డుల పంపిణీ పూర్తి
- ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి.బాలమాయదేవి

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తూ పారదర్శకంగా ఓటరు జాబితా ఉండాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాల మాయదేవి అన్నారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో ఓటర్ సవరణ జాబితాపై ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లా అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సమీక్షలో ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఓటర్ల తుది జాబితా వివరాలు, జనాభా ఓటర్ల నిష్పత్తి, మహిళలు, పురుషుల ఓటర్ల నిష్పత్తి, డ్రాఫ్ట్ ఓటర్ జాబితా ప్రచురణ తర్వాత వచ్చిన దరఖాస్తులు, వాటి స్థితిగతులు, ఓటర్ కార్డుల పంపిణీ లాంటి పలు అంశాలను అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలమాయదేవి మాట్లాడుతూ ఓటర్ల తుది జాబితాను విజయవంతంగా ప్రచురించడం పట్ల అభినందనలు తెలిపారు. నూతన ఓటర్ల నమోదు కొంత తక్కువగా ఉన్న నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణ సమయంలో మాత్రమే కాకుండా ఇతర సమయాల్లో కూడా స్వీప్ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలో నడిచే గురుకులాల్లో పిల్లలకు అందిస్తున్న కామన్ డైట్ అమలు జరిగేలా చూడాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కామన్ డైట్ ప్రకారం పిల్లలకు కూరగాయలు, నాన్‌వెజ్ భోజనం అందేలా చూడాలని, బీసీ సంక్షేమ హాస్టల్స్‌ను ర్యాండంగా పరిశీలించాలన్నారు.

అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ జిల్లాలో జనాభా ఓటర్ల నిష్పత్తి 695 ఉందని అన్నారు. నూతన ఓటర్లకు ఓటరు కార్డులు ముద్రణకు పంపామని, జిల్లాలో 98.15 శాతం మేర ఓటర్ కార్డులు పంపిణీ పూర్తి చేశామన్నారు. ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని జిల్లాలో పారదర్శకంగా నిర్వహించామని, ప్రతి దశలో రాజకీయ పార్టీల ప్రతినిధులను భాగస్వామ్యం చేశామని అన్నారు.

ఖమ్మం జిల్లాలో 5 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, వీటికి సంబంధించి మొత్తం 12లక్షల 30 వేల 572 ఓటర్లతో తుది ఓటర్ జాబితా తయారు చేశామని, మహిళలు పురుషుల నిష్పత్తి 1076గా ఉందని అదనపు కలెక్టర్ తెలిపారు. డ్రాఫ్ట్ ఓటర్ జాబితా ప్రచురించిన తర్వాత ఖమ్మం జిల్లాలో మొత్తం 8582 నూతన ఓటర్లను జాబితాలో నమోదు చేశామని, అదే సమయంలో చనిపోయిన 1641, ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లిన 3472, రిపీటెడ్ వచ్చిన 127 పేర్లను తొలగించినట్లు వివరించారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు బాలమాయదేవి

ఖమ్మం జిల్లాలో మొత్తం 27వేల 225 దివ్యాంగ ఓటర్లు ఉన్నారని, డ్రాఫ్ట్ ఓటర్ జాబితాపై వచ్చిన 21 వేల 549 దరఖాస్తులలో ఇప్పటి వరకు 18 వేల 411 దరఖాస్తులను ఆమోదించామని, 3112 దరఖాస్తులు తిరస్కరించామన్నారు. అనంతరం మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు సంబంధించి అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ సమీక్షించారు. ఈ సమావేశంలో పీవో ఐటీడీఏ భద్రాచలం బి.రాహుల్, మూడు జిల్లాల ఈఆర్వోలు, ఏఆర్‌వోలు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

12,30,572

(5వ పేజీ తరువాయి)

కేంద్రాల్లో తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. జిల్లాలో ఇటీవలె అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కొత్త ఓటర్లను నమోదు చేయడంతోపాటు రెండు చోట్ల నమోదైన ఓటర్లను తొలగించారు. వలసలు, మృతిచెందిన వారి ఓటర్లను తొలగించి తాజాగా ఓటర్లతో తుది జాబితాను సిద్ధం చేసి నవంబరులో ప్రకటించారు. ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లో మొత్తం 1460 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఖమ్మం నియోజకవర్గంలో 355, పాలేరులో 291, మధిరలో 268, వైరాలో 252, సత్తుపల్లిలో 292 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుత తుది జాబితాప్రకారం జిల్లాలో 12,30,572 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 5,92,800మంది, 6,37,684 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇతరులుగా 88 మంది ఉన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో 3,24,234 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 1,55,326, మహిళలు 1,68,859 మంది ఇతరులు 49 మంది ఉన్నారు. పాలేరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,42,888 మంది కాగా పురుషులు 1,16,655 మంది, మహిళలు 1,26,225 మంది ఉన్నారు. ఇతరులు 8 మంది ఉన్నారు. మధిరలో మొత్తం ఓటర్లు 2,23,365 ఉండగా పురుషులు 1,07,550 మహిళా ఓటర్లు 1,15,805, ఇతరులు 10మంది ఉన్నారు. వైరా నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,94,540 మంది ఉండగా వీరిలో పురుషులు 94,196 మంది, మహిళలు 1,00,340 మంది ఇతరులు 4మంది ఉన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,45,545 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,19,073 ఉన్నారు. మహిళలు 1,26,455 మంది కాగా ఇతరులు 17 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా మహిళలే అధికంగా ఉండడం గమనార్హం.

హక్కుల కోసం గౌడలు సంఘటితం కావాలి

- ఏజన్సీ ప్రాంతాల గౌడ కులస్థుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ నరాటి వెంకన్న

గుండాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏజన్సీ ప్రాంతాల్లోని గౌడులకు రాజ్యంగా బద్ధంగా కల్పించిన హక్కుల సాధన కోసం గౌడ కులస్థులు సంఘటితం కావాలని రాష్ట్ర ఏజన్సీ ప్రాంతాల గౌడ కులస్థుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ నరాటి వెంకన్న, రాష్ట్ర నాయకులు బస్వ వెంకటేశ్వర్లు, ఉమ్మాగాని సత్యం అన్నారు. సోమవారం గుండాలలో ఏజెన్సీ గౌడుల ఆత్మీయ సమ్మేళనం బత్తిని సాయన్న అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పాలకులు మారుతున్న ఏజన్సీ ప్రాంతాల్లోని గౌడుల బతుకులు మారడంలేదని, హక్కులు కాలరాసి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం చేస్తున్నారన్నారు. దీంతో కులవృత్తిని నమ్ముకున్న గీతకార్మిక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజన్సీ ప్రాంత గౌడ్‌లను ఎస్టీలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, మహిళలు, యువత, గీతకార్మికులు సంఘటిత ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం మం డల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా యాసారపు సురేష్, మాచర్ల రంజిత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మండ వెంకన్న, భద్రాద్రి జిల్లా నాయకులు కొత్తా వెంకటేశ్వర్లు, శ్రీరాం కోటయ్య, మహబూబాబాద్ జిల్లా నాయకుడు బత్తిని రాంమూర్తి, కత్తి రమేష్, గుండాల మండల నాయకులు యాసారపు వెంకన్న, మాచర్ల సత్యం, గుండెబోయిన నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ వెంకన్న

క్రైం సమాచారం

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య



కరకగూడెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగళ్ల పంచాయతీకి చెందిన పాయం సతీష్(28) అనే యువకుడు మద్యం మత్తులో శనివారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కరకగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో మణుగూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో భద్రాచలం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సతీష్ ఆదివారం రాత్రి మృతి చెందాడు. సోమవారం మృతుడు తండ్రి పాయం పుల్లయ్య కరకగూడెం పోలీస్‌స్టేషన్‌లో సతీష్ మద్యం మత్తులో పురుగుల మందు తాగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్థలం వివాదంలో మహిళలపై దాడి

ఖమ్మంక్రైం, జనవరి6(ఆంధ్రజ్యోతి): ఇంటిస్థలం విషయంలో మహిళలపై దాడి జరిగిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఖమ్మం నగర పరిధిలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర పరిధిలోని రామన్నపేట కాలనీ బొమ్మస్వామి గుడి రోడ్డులో కొన్ని కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అక్కడ ఉంటున్న పందిపోటు వీరబాబు అనే వ్యక్తి బాత్రూమ్ నిర్మిస్తున్న క్రమంలో ఇంటి పక్కన గోడ అడ్డుగా ఉందని కూల్చాలంటూ గొడవ చేశాడు. దీంతో కొంతమంది ఖానాపురంహవేలి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి సమయంలో తమపై ఫిర్యాదు చేస్తారా అంటూ వీరబాబుతో పాటు పలువురు కలిసి ఫిర్యాదుచేసిన మహిళలపై తీవ్రంగా దాడిచేశారు. ఈఘటనపై తమకు న్యాయం చేయాలంటూ బాధితులు మళ్లీ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఈఘటనపై ఫిర్యాదు అందినట్టు ఖానాపురం హవేలి పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య



మధిర రూరల్, జనవరి6(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం మండలంలోని ఆత్కూరు గ్రామంలో జరిగింది. ఆత్కూరుకు చెందిన కంభంపాటి నందిని(28) మధిర పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఓ రెడీమేడ్ షాపులో గుమ్మస్తాగా పనిచేస్తుంది. ఈనెల ఒకటోతేదీన సెలవు పెట్టకుండా ఇంటి వద్దనే ఉండిపోయింది. దీంతో ఆగ్రహించిన షాపు యజమాని నరేంద్ర మరుసటిరోజు నందిని షాపునకు రావడంతో అనుచితంగా ప్రవర్తించాడు. అంతేకాక మరోషాపులో కుదిరేందుకు వెళ్లిన నందినిని అక్కడ కూడా చేర్చుకోనివ్వకుండా అడ్డుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన నందిని సోమవారం మధ్యాహ్నం తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లిన సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తమ కుమార్తె మరణానికి షాపు యజమానే కారణమని మృతురాలి బంధువులు పెద్ద ఎత్తున ఆత్కూరు నుంచి మధిరకు తరలివచ్చి షాపు ఎదుట ఆందోళన నిర్వహించారు. యజమానిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చింతకాని, జనవరి 6(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన చిర్రా వెంకటేశ్వర్లు (40) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జగన్నాథపురం గ్రామానికి చెందిన మృతుడు పందిళ్లపల్లి గ్రామ సమీపంలో పొలం కౌలుకు తీసుకుని మిరపపంట సాగు చేశాడు. ఆదివారం మిరప పంటకు కలుపు మందు పిచికారీ చేసేందుకు పొలానికి వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుమారుడు రఘు ఫోన్ చేసినా స్పందించక పోవడంతో అనుమానం వచ్చిన రఘు స్నేహితుడిని వెంటతీసుకుని పొలానికి వెళ్లగా వెంకటేశ్వర్లు అపస్మారకస్థితిలో పడిఉన్నాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఖమ్మంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె. మృతుని కుమారడు రఘు ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు ఇసుక లారీల పట్టివేత

ముదిగొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను సోమవారం ముదిగొండ పోలీసులు పట్టుకున్నారు. సీఐ మురళీ ఆదేశాల మేరకు ఏఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి లక్ష్మీపురం హైవే అండర్‌పాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇందుగపల్లి ర్యాంపు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఖమ్మానికి తరలిస్తున్న రెండు ఇసుక లారీలను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

చెల్లని చెక్కు కేసులో సంవత్సరం జైలు

ఖమ్మం లీగల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో నిందితురాలైన కొమ్మనబోయిన అరుణకు సంవత్సరం జైలు శిక్షతోపాటు ఫిర్యాదుకి నిందితురాలు రూ.రెండు లక్షల యాభై వేలు చెల్లించాలని ఖమ్మం ఆబ్కారి ప్రత్యేక న్యాయస్థానం న్యాయాధికారి రాళ్లబండ శాంతిలత సోమవారం తీర్పు చెప్పారు. ఖమ్మం నగరంలోని పాండురంగాపురానికి చెందిన పొందుగల కృష్ణ వద్ద నిందితురాలైన అరుణ 2016లో రూ. రెండు లక్షల యాభై వేలు అప్పు తీసుకుంది. తరువాత తన రుణం తిరిగి చెల్లించమని ఒత్తిడి చేయగా నిందితురాలు 2017లో చెక్కు ఇచ్చింది. కానీ ఖాతాలో డబ్బు లేకపోవడంతో డబ్బులు రాలేదు. దీంతో కృష్ణ కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. న్యాయాధికారి కేసును విచారించి నేరం రుజువు కావడంతో పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

198 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కారేపల్లి, జనవరి6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని కారేపల్లి మండల పరిధిలోని పంతులునాయక్ తండాలో రవాణాకు సిద్ధం అవుతున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం అర్ధరాత్రి ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న 198 క్వింటాళ్ల బియ్యంతో పాటు లారీ, బొలేరో వాహనాన్ని కారేపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా కారేపల్లి ఎస్ఐ రాజారాం మాట్లాడుతూ అర్ధరాత్రి పట్టుకున్న చౌక బియ్యంతో పాటు స్వాధీనం చేసుకున్న లారీ, బొలేరో వాహనాన్ని సోమవారం తమకు అప్పగించిన్నట్లు తెలిపారు.

గల్లంతైన యువకుడి కోసం గాలింపు

కల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పడమట లోకవరం గ్రామంలో ఆదివారం సాగర్ కాల్వ వద్దకు సెల్ఫీ దిగేందుకు వెళ్లి పరిమి శివ అనే యువకుడు గల్లంతైన విషయం తెలిసిందే. సోమవారం మండల స్థాయి అధికారుల సమక్షంలో రెస్క్యూ టీంతో శివ మృతదేహం కోసం. గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామస్థులు కూడా జాలర్లతో లోకవరం పరిసర గ్రామంలో కాల్వ వెంట గాలించినా దొరకలేదు. తహసీల్దార్ సాంబశివుడు, ఎస్ఐ నివేదిత క్షేత్ర స్థాయిలో కాల్వలో గాలింపు చర్యలను పర్యవేక్షించారు.

ఇద్దరిపై బైండోవర్ కేసు నమోదు

దుమ్ముగూడెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్డర్లపై కోడికత్తులు తయారు చేస్తున్న పెదార్లగూడేనికి చెందిన కారం చలపతి, కారం కన్నప్పను పోలీసుల సోమవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. వీరు తయారు చేస్తున్న 15 కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఏడాది కాలానికి రూ.లక్ష మొత్తానికి బైండోవర్ చేశారు. కొన్ని అసాంఘిక శక్తులు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు లో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాన్ని ఆసరాగా చేసుకొని కోడి పందేల జూదం నిర్వహిస్తున్నారు.

మరో కార్యక్రమంలో భాగంగా లక్ష్మీనగరం సెంటర్లో ద్విచక్రవాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై సీఐ అశోక్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఐ గణేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'కొత్త' కొత్తగా ఉన్నది..



కొత్తగూడెం పట్టణం

- కొత్తగూడెం నగరపాలక సంస్థ ఏర్పాటుతో మరింత అభివృద్ధి
- ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు
- ఏర్పాటు కానున్న పోలీస్ కమిషనరేట్
- ఎయిర్‌పోర్టు ఏర్పాటు కోసం సన్నాహాలు..

కొత్తగూడెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో పురపాలక సంఘం నుంచి నగరపాలక సంస్థ స్థాయి నుంచి నగరపాలక సంఘంగా అప్‌గ్రేడ్ సాధించిన కొత్తగూడెం పట్టణంలో కొంగొత్త మార్పులు సంతరించుకోనున్నాయి. పాల్వంచ - కొత్తగూడెం పట్టణాల్లోని ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 450 కోట్ల నిధులు మంజూరుచేసి ఔటర్‌రింగ్ రోడ్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. కొత్తగూడేనికి 40 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైంది. కొత్తగూడెం ప్రాంతంలో ఎయిర్ పోర్టు ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. దీని సర్వే కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.38లక్షల నిధులు మంజూరుచేసింది.

భూముల విలువ పెరిగే అవకాశం..

నగరపాలక సంస్థలో విలీన ప్రాంతాలు, పంచాయతీల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాబోతున్నాయి. ఇక్కడ నివాస, వ్యవసాయ భూముల ధరలు పెరగనున్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సైతం అధికం అవుతాయి. కార్పొరేషన్ ఏర్పాటైతే దీని పరిపాలన కోసం ఉద్యోగ సిబ్బందిని కూడ అదనంగా నియమించనున్నారు. ప్రత్యేక అధికారులు కూడా రానున్నారు.

అన్నింటా కొత్తదనం..

జిల్లా పోలీస్ సూపరింటెండెంట్(ఎస్పీ) పరిధి పెరిగి కమిషనర్ రేట్‌గా మారి పర్యవేక్షణ అంతా కమిషనర్ ఆఫ్ పోలీస్(సీపీ) కిందకు వస్తుంది. వార్డులు పోయి కార్పొరేషన్ పరిధిలో డివిజన్లు ఏర్పాటు అవుతాయి. పాల్వంచలో 24 వార్డులు ఉండగా కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డులు ఉన్నాయి. మొత్తం రెండు మున్సిపాలిటీ పరిధిలో 60 వార్డులు ఉన్నాయి. వీటితోపాటుగా సుజాతనగర్, కోమటపల్లి, లక్ష్మీదేవిపల్లి, నర్సింగసాగర్, వేపలగడ్డ, నిమ్మలగూడెం, నాయకులగూడెం ఏడు గ్రామ పంచాయతీలు కూడా విలీనమయ్యాయి. దీంతో జనాభా పునర్విభజన జరిగి కొత్త డివిజన్లు ఏర్పాటు అవుతాయి.

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డులు ఉండగా లక్షకుపైగా నాభా ఉన్నారు. 65వేల ఓటింగ్ ఉంది. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో 1.20లక్షల జనాభా ఉంది. 70వేల ఓటింగ్‌పైగా ఉంది. సుజాతనగర్ మండల పరిధిలోని ఏడు గ్రామపంచాయతీలో 14 వేల వరకు జనాభాఉండగా పది వేల పైగా ఓటింగ్ ఉంది. అయితే ఈ ఓటింగ్‌ను బట్టి, జనాభాను బట్టి కొత్తగూడెం కార్పొరేషన్‌ను బట్టి 35 నుంచి 40 వరకు డివిజన్లు ఏర్పాటు అయ్యే అవకాశాలు ఉన్నాయి. కార్పొరేషన్ పరిధిలో భూములు, ఆస్తులు విలువలతో పాటు ఇళ్లు, పంపులకు సంబంధించిన పన్నులు కూడ అదేస్థాయిలో పెరగనున్నాయి. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో గత 20 ఏళ్లుగా ఆ మున్సిపాలిటీకి ఎన్నికలు జరగలేదు. దీనికి కారణం కోర్టులో కేసులో ఉన్నందున ఎన్నికలు జరగకపోవడంతో ప్రత్యేక అధికారుల పరిపాలనే కొనసాగుతోంది. కార్పొరేషన్ అయిన తర్వాత పాల్వంచ మున్సిపాలిటీ కూడా కార్పొరేషన్ పరిధిలోకి రావడంతో ఆ పరిధిలో ఎన్నికలు జరుగనున్నాయి.

లాభనష్టాలపై బేరీజు..

కొత్తగూడెం అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్‌గా రూపాంతరం చెందితే కలిగే లాభ, నష్టాలను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే ప్రత్యేక నిధులు, వచ్చే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ లాంటి పథకాలలో ఎంపిక చేయనుండటంతో కోట్లాదిరూపాయల నిధులు సమకూరే అవకాశం ఉంది. నగరాలకు మంజూరు అయ్యే నిధులు అదనంగా అందనున్నాయి. ప్లాన్ గ్రాంట్లు, నాన్ ప్లాన్ గ్రాంటులతో పాటు 14,15 ఆర్థికసంఘం నిధులు రానున్నాయి. కార్పొరేషన్‌గా ఏర్పాటుచేస్తే మరిన్ని పరిశ్రమలు ఏర్పాటై, యువతకు ఉద్యోగాలు లభించే అవకాశాలు ఉంటాయి. కార్పొరేషన్‌గా మారితే కొంతమేర నష్టాలు సైతం ఉన్నట్లు అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కార్పొరేషన్ ఏర్పాటుతో సుజాతనగర్ లో ఉపాధిహామీ పథకం, ఎన్‌ఆర్‌జీఎస్ ఫండ్స్,కేంద్రప్రభుత్వ ఫండ్స్‌కు అటంకం కలుగుతుంది. విలీన ఏడు గ్రామాల్లో, పాల్వంచలలో ప్రస్తుతమున్న ఇంటిపన్నులు, ట్రేడ్ లైసెన్సు, పలు రకాల టాక్స్‌లు ఇప్పుడు కాకపోయినా ఒకటి, రెండు సంవత్సరాలలో రెట్టింపయ్యే అవకాశాలు ఉంటాయనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

ఒకప్పుడు సింగరేణి పాలనలో..

కొత్తగూడెం పట్టణాన్ని 1970వరకు సింగరేణి పరిపాలన చూసుకునేది. 1971 నుంచి 1995వరకు కొత్తగూడెం నోటిఫైడ్ ఏరియా(ఎన్‌ఏసీ) కమిటీ అమలులో ఉంది. అనంతరం కొత్తగూడేన్ని గ్రేడ్ - 1 మునిసిపాలిటీగా ప్రకటించారు. పాల్వంచ మునిసిపాలిటీ 1987లో 3వ గ్రేడ్‌గా ఏర్పడింది. 2001నుంచి 2016వరకు అప్‌గ్రేడ్ చేశారు.

11నుంచి టీసీసీ పరీక్షలు

కొత్తగూడెం అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 11వ తేదీ నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) పరీక్షలు నిర్వహిస్తామని డీఈవో ఎం వెంకటేశ్వరచారి సోమవారం తెలిపారు. ఈపరీక్షల నిర్వహణకు జిల్లాలో రెండు సెంటర్లు ఏర్పాటుచేశామన్నారు. డ్రాయింగ్, లోయర్, హయ్యర్ పరీక్షలు ఉదయం 10.00 నుంచి 12.30 మధ్యాహ్నం 2.00నుంచి 4.30వరకు టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు ఉదయం 10.00 నుంచి 1.00 వరకు మధ్యాహ్నం 2.00నుంచి 5.00 వరకు నిర్వహించనున్నామని తెలిపారు. హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, మరిన్ని వివిరాలకు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్. మాధవరావు సెల్‌నెం. 9989027943 సంప్రదించాలని కోరారు.

భట్టి దృష్టికి శ్మశాన స్థలం రిజిస్ట్రేషన్ వ్యవహారం

- విచారణకు ఆదేశించిన ఉప ముఖ్యమంత్రి..?

మధిరటౌన్, జనవరి6(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో రూ. 3కోట్ల విలువ చేసే 2,783 గజాల హిందూ శ్మశాన వాటిక, నాలా స్థలం రిజిస్ట్రేషన్ విషయం గురించి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరా తీసినట్లు తెలిసింది. రిజిస్ట్రేషన్ విషయం గురించి తెలుసుకున్న భట్టి విక్రమార్క వెంటనే విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. దీంతో అధికారులు ఆగమేగల మీద రికార్డులు వెతికే పనిలో ఉన్నారు. దీనిపై మధిర సబ్‌రిజిస్ట్రార్ రాజును వివరణ కోరగా మరోసారి ఒరిజినల్ డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తామని, అవి నకిలీవి అని తెలిస్తే రిజిస్ట్రేషన్‌ను బ్లాక్ చేస్తామని తెలిపారు. కాగా అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో సదరు కార్యాలయ ఉద్యోగి ఒకరు సూత్రధారిగా వ్యవహరించారని ప్రచారం సాగుతోంది. మరో ఉద్యోగి ఏకంగా సాక్షి సంతకాలు కూడా చేసినట్లు తెలిసింది.

సంక్రాంతి వేడుకల్లో విద్యుత్ జాగ్రత్తలు పాటించాలి

- ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినోత్సవాలు ప్రజల కు సంతోషం నింపాలని, పతంగులను ఖాళీ ప్రదేశాలు, విద్యుత్ తీగలు సమీపంలో లేని ప్రాంతాల్లోనే ఎగరవేయాలని టీజీ ఎన్పీడీసీఎల్, ఎస్ఈ సురేందర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్ ఉపకేంద్రాలకు సమీపంలో పతంగులు ఎగరవేయటం నిషేధించామని అన్నారు. విద్యుత్ తీగలకు పతంగులు పడి ఉంటే విద్యుత్ సిబ్బందికి లేదా 1912కు ఫోన్ చేయాలని కోరారు. పిల్లలు, వారి బంధువులు విద్యుత్ స్తంభాల పైకి ఎక్కొద్దని హెచ్చరించారు.

అరుణ్‌కుమార్‌కు నాగార్జున వర్సిటీ డాక్టరేట్



ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో నగరానికి చెందిన దోణవాణ్ అరుణ్‌కుమార్‌కు డాక్టరేట్ లభించింది. ఈనెల 3న ఏపీలోని నాగార్జున యూనివర్సిటీ రీసెర్చ్ సెల్ కో-ఆర్డినేటర్ పి. సుధాకర్ పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేశారు. అరుణ్‌కుమార్ 'ఎఫెక్ట్ ఆఫ్ ఎలాస్టిక్ బాండ్ బేస్ పై మెట్రిక్ ఎక్సర్‌సైజ్‌అండ్ కాంపౌండ్ వెయిట్ ట్రైనింగ్ ఆఫ్ సెలెక్టెడ్ స్ట్రెంత్ పవర్ అండ్ స్కిల్ రిలేటెడ్ పర్ఫామెన్స్ ఆఫ్ ఫుట్‌బాల్ ప్లేయర్స్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించారు.

విద్యార్థులు ఆంగ్లంలో సంభాషించేలా ప్రోత్సహించాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కొణిజర్ల, జనవరి6(ఆంధ్రజ్యోతి): రోజువారి జీవితంలో మాట్లాడే విధంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు నేర్పించాలని, ప్రతి విద్యార్థిపై శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. సోమవారం కొణిజర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వుయ్ కెన్ లెర్న్ వర్క్‌షాపును కలెక్టర్ అదనపు కలెక్టర్ పి. శ్రీజ, ట్రైనీ కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వుయ్ కెన్ లెర్న్ కార్యక్రమాన్ని జిల్లాలో ముందస్తుగా 16 పాఠశాలల్లో ప్రారంభించి, తరువాత మరో 18 పాఠశాలలకు విస్తరించామని అన్నారు. మొత్తం 61 మంది హైస్కూల్ టీచర్లకు ఒక రోజు వర్క్‌షాపులో అవగాహన కల్పించామన్నారు. తరగతి గదుల్లో ఇంగ్లీషులో మాట్లాడే విధంగా తయారు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పిల్లలకు ఆంగ్లం తెలిస్తే పోటీ ప్రపంచంలో ఇతరులతో కమ్యూనికేట్ చేయడం చాటా సులభం అన్నారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ మాట్లాడుతూ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు నేర్పించేందుకు వీలుగా ఉపాధ్యాయులకు ఒకరోజు వర్క్‌షాపు ద్వారా శిక్షణ ఇచ్చామని, ఈ వర్క్‌షాపులో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో సోమశేఖరశర్మ, ఏఎంవో రవికుమార్, ఎంఈవో అబ్రహం, పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు శాంతకుమారి, వుయ్ కెన్ లెర్న్ వర్క్‌షాపు చీఫ్ మెంటర్స్ ఆస్ర, పవిత్రదీక్షిత్, ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సరఫరాను నిరోధించాలి

- వీడియో కాన్ఫరెన్సు సమీక్షలో అడిషనల్ డీసీపీలు



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న అధికారులు

ఖమ్మంక్రైం, జనవరి6 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల సరఫరా, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించడానికి క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టిసారించాలని అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాదరావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని సీపీ కార్యాలయం నుంచి జిల్లా పోలీసు అధికారులతో వీడియోకాన్ఫరెన్సు నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.గ్రామాల్లో ర్యాలీలు, సదస్సులు నిర్వహించి మాదకద్రవ్యాల వినియోగం వల్లవచ్చే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కలిపించడమే కాకుండా కట్టుదిట్టమైన నిఘాతో అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సైబర్ నేరగాళ్ల బారిన పడ్డామని గుర్తించిన వెంటనే 1930కుగాని సైబర్‌క్రైం వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. పోయిన డబ్బు వెనక్కి రావడదానికి ఆవకాశాలు ఎక్కువగా ఉంటాయనే విషయాన్ని కూడా విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. . ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడం, కార్లలో సీటుబెల్టుతో పాటు వాహనా చట్టం నిబంధనలు అమలుచేయడం ద్వారా భారీగా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించి, పెండింగ్ లేకుండా చూడాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్, అదనపు కలెకర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సన్యాసయ్య, డీఆర్వో. రాజేశ్వరి పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

రైతులను దగా చేసిన ప్రభుత్వం

- సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర

తల్లాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు రూ.రెండులక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.15వేలు రైతుభరోసా ఇస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చి ఏడాదైనప్పటికీ పూర్తిస్థాయిలో అమలుచేయకుండా రైతులను రాష్ట్ర ప్రభుత్వం దగా చేసిందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. సోమవారం తల్లాడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన వరంగల్ రైతు డిక్లరేషన్ హామీలను అమలుచేయడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో దొడ్డా శ్రీనివాసరావు, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, దిరిశాల దాసూరావ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బియ్యంలో పురుగులు

- ఎంఈవో దృష్టికి తీసుకెళ్లిన హెచ్‌ఎం లు

కొణిజర్ల, జనవరి6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ నుంచి మధ్యాహ్నం భోజనం నిమిత్తం ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తున్న బియ్యంలో తెల్లపురుగులు, తుట్టులు కనిపించాయి. మండలంలోని పెద్దగోపతి ప్రాథమిక పాఠశాలతో పాటు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం కోసం బియ్యం బస్తాలను తీయగా బస్తాలలో బియ్యంతో పాటు తెల్లపురుగులు, తుట్టులు పట్టిన బియ్యం కనిపించాయి. దాంతో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఎంఈవోకు సమాచారం ఇచ్చారు. విద్యార్థులకు సరఫరా చేసే బియ్యంలో పురుగులు రావడం పట్ల ఆయా గ్రామాల్లో చర్చ జరుగుతోంది. ఈ విషయంపై ఎంఈవో అబ్రహంను వివరణ కోరగా.. ప్రస్తుతం రెండు పాఠశాలల నుంచి తెల్లపురుగులు వచ్చిన్నట్లు తెలిపారని, తను విషయాన్ని డీఈవో దృష్టికి తీసుకెళ్లిన్నట్లు తెలిపారు. తెల్లపురుగులు వచ్చిన బియ్యాన్ని మార్పిస్తామన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి గాను పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులు ఈ పాస్ వెబ్‌సైట్లో దరఖాస్తులు చేసుకోవాలని భద్రాద్రి జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారి డి.అనసూర్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకార వేతనాలు నమోదు చేసుకునేందుకు చివరి తేదీ మార్చి31 వరకు పొడిగించడం జరిగిందన్నారు.

విద్యార్థులు తమ బ్యాంకు అకౌంట్‌కు సంబంధించిన బ్యాంక్ బ్రాంచ్‌లో ఆధార్ ఫీడింగ్ చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ , ప్రైవేటు కళాశాల ప్రిన్సిపాల్ డిజిటల్‌కీ కి సంబంధించి ప్రిన్సిపాల్ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. కళాశాల ఈ- పాస్ లాగిన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, విద్యార్థుల ఉపకార వేతనాల దరఖాస్తులు ధ్రువీకరించిన అనంతరం డిజిటల్ సంతకం చేసి మాత్రమే ఈ -పాస్ లాగిన్‌లో జిల్లా అధికారికి ఫార్వర్డ్ చేయాలని తెలిపారు.

మైనారిటీలకు బేసిక్ ఫౌండేషన్ శిక్షణ

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మైనారిటీ అభ్యర్థులు బేసిక్ ఫౌండేషన్ శిక్షణ కోసం 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కె. సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వ పోటీ పరీక్షలైన గ్రూప్ -1 ప్రిలిమ్స్, గ్రూప్-2, గ్రూప్ -3 , గ్రూప్ -4 పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు, బ్యాంకింగ్ మొదలగు పోటీ పరీక్షల కొరకు సన్నద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు ఖమ్మం జిల్లాలో 4 నెలల పాటు ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

'చెమట చుక్కలకు తర్ఫీదు' లోగో ఆవిష్కరణ

కొత్తగూడెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగుల పిల్లలకు విదేశాల్లో ఉన్నత విద్య, ఉపాధి కోసం ప్రోత్సహించేందుకు 'చెమట చుక్కలకు తర్ఫీదు' అనే కార్యక్రమ లోగోను సోమవారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. కార్యక్రమ వివరాలను సింగరేణి సీఎండీ బలరాం వివరించారు. సింగరేణి కార్మికుల పిల్లలు కేవలం చిన్న ఉద్యోగాలకే పరిమితం కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ఎదిగేందుకు ఉన్న అవకాశాలపై వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు, కెరీర్ గైడ్‌లైన్స్‌ను ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రముఖ నిపుణులతో సింగరేణి ప్రాంతంలో ఏర్పాటు చేస్తామన్నారు.



ఆంధ్రజ్యోతి KHAMMAM CITY

మంగళవారం 7 జనవరి 2025

ఖమ్మం సిటీ ZONE 8

- ఖమ్మం ● రఘునాథపాలెం
- ఖమ్మం రూరల్
- తిరుమలాయపాలెం
- కూసుమంచి
- నేలకొండపల్లి ● కామేపల్లి

ఇందిరమ్మ ఇళ్లపై ఆంక్షలు ఎత్తివేయాలని వినతి

ఖమ్మంటౌన్, జనవరి6(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ షఫీఉల్లాకు వినతిపత్రం అందచేశారు. ఖమ్మంలో నివాసం ఉండే వారి స్థలాలు రఘునాథపాలెం మండల పరిధిలో ఉన్నాయని, దీంతో ఇందిరమ్మ పథకం కింద సదరు స్థలాల లబ్ధిదారులను గుర్తించటం లేదని వినతిపత్రంలో వివరించారు. ఖమ్మం నియోజకవర్గ పరిధిలో ఎక్కడ ప్రభుత్వ స్థలం ఉన్నా ఈ పథకం వర్తింప చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చినవారిలో సీపీఎం రాష్ట్ర కమిటీసభ్యుడు యర్రా శ్రీకాంత్, డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, జబ్బార్, నవీన్‌రెడ్డి, తిరుపతిరావు, మీరాసాహెబ్, భూక్యా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు



(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రు.
వంకాయ	38
గుత్తి వంకాయ	40
బీరకాయ	58
పచ్చిమిర్చి	40
కాకరకాయ	44
బెండకాయ	58
పొట్లకాయ	44
దోసకాయ	34-44
చిక్కుడు	58
నాటుచిక్కుడు	90
గోరుచిక్కుడు	54
క్యాబేజీ	24
దొండ	58-60
సొరకాయ	28
క్యారెట్	48
క్యాప్సికం	64
ఆలుగడ్డ	34
ఉల్లిగడ్డ	40-50
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	170
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	ముఫాసా
శ్రీనివాస:	మ్యాక్స్
సాయిరాం:	డ్రింకర్‌సాయి/యూఐ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	యూఐ

పీఎస్సాఆర్ ట్రస్టు, ఎస్టీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలండర్ ఆవిష్కరిస్తున్న భట్టి

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి6 (ఆంధ్రజ్యోతి) డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోమవారం ప్రజాభవన్లో ఎస్టీఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు, సంఘాల నాయకులకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. డైరీఆవిష్కరణ సందర్భంగా ఎస్టీఎఫ్ రాష్ట్రఅధ్యక్షుడు దేవరకొండ సైదులు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వం నుంచి ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, డీఏలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ ప్రధాన కార్యదర్శి పోచయ్య, వివిధజిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఖమ్మంకలెక్టరేట్:సామాజికసేవ ఓవరంలాంటిదని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు రూపొందించిన 2025 సంవత్సర క్యాలెండర్‌ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, ట్రెయినీ కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ, ట్రస్టువ్యవస్థాపక అధ్యక్షుడు పరిశ పుల్లయ్య, కనపర్తి వెంకటేశ్వర్లు, నంబూరి శంకర్రావు, మీడియా ప్రతినిధులు ఏనుగు వెంకటేశ్వరరావు, నలజాల వెంకట్రావు,రాఘవ పాల్గొన్నారు.

ఖమ్మంవాసికి పూలే అవార్డు

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన సామాజిక సేవకురాలు దగ్గుపాటి రమాదేవి సావిత్రి బాయిపూలే ఎక్సలెన్స్ నేషనల్ అవార్డును సోమవారం అందుకున్నారు. హోప్ స్వచ్ఛందసేవా సమితి, సింధు ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాదులో అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం వినతుల వెల్లువ

- బస్‌డిపో రోడ్డు డివైడర్లు తొలగించాలని కార్పొరేటర్ల వినతి
- ఫిర్యాదులు స్వీకరించిన మేయర్ నీరజ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి6(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ నివాసాలకు సర్వే చేపట్టాలని ఖమ్మం నగర పాలక సంస్థకు నిరుపేదలు క్యూ కట్టారు.కేఎంసీ కమిషనర్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌సమావేశానికి హాజరవటంతో మేయర్ పునుకొల్లు నీరజ, అసిస్టెంట్ కమిషనర్ షఫీ ఉల్లా వినతులు స్వీకరించారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మఇళ్ల కోసం దరఖాస్తులు చేసిన ఇప్పుడు సర్వే చేపట్టటం లేదని అధికంగా దరఖాస్తు చేసుకున్నారు. ఒకే ఇంటికి రెండు నెంబర్లు కేటాయించి ట్యాక్స్‌లు నోటీసులు పంపుతున్నారని ఎన్ఎస్‌పీ ప్రాంతానికి చెందిన ఇంటి యజమాని వినతిపత్రం అందించారు. ఇంటి నెంబర్లు కేటాయించాలని, అక్రమ నిర్మాణాలు తొలగించాలని, తాగునీటి పంపు కనెక్షన్ ఇవ్వాలని వినతిపత్రాలను అందించారు. వచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను మేయర్ పునుకొల్లు నీరజ ఆదేశించారు. బస్‌డిపో రోడ్డులో రహదారి వాహనాల రవాణాకు ఇబ్బందిగా మారిందని, డివైడర్లను తొలగించాలని కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ విన్నవించారు. వెంటనే డివైడర్లను తొలగించాలని కమిషనర్ అభిషేక్ అగస్త్యకు మేయర్ పునుకొల్లు నీరజ ఫోన్‌లో ఆదేశించారు. ఉపమేయర్ పాతిమా జోహరా, ఈఈ కృష్ణలాల్, పట్టణ ప్రణాళిక అధికారి వసుంధర, ఆర్వోశ్రీనివాసరావు, మెప్మా టీఎంసీ సుజాత పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ ప్రతీ ఒక్కరూ పాటించాలి



వారోత్సవాలు నిర్వహిస్తున్న రవాణాశాఖ అధికారులు

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి6(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రూల్స్ ప్రతీ ఒక్కరూ పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఖమ్మం రవాణాశాఖ కార్యాలయ అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఆర్ స్వర్ణలత, వి.గోపీకృష్ణ, సుమలత పేర్కొన్నారు. సోమవారం రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని న్యూఇరా పాఠశాల విద్యార్థులకు, ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డుభద్రత నిబంధనలు పాటించడం ద్వారా సురక్షితమైన ప్రయాణం చేయవచ్చునని, వేగంగా వాహనాలు నడపొద్దని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపవద్దని, మైనర్ డ్రైవింగ్ చేయటం నేరమని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ కానిస్టేబుల్స్ రమేష్, లక్ష్మీ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో హార్వెస్ట్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ రవిమారుత్

ఖమ్మంస్పోర్ట్స్, జనవరి6(ఆంధ్రజ్యోతి): ఈనెల5న నగరంలోని షాదీఖానాలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభచూపి పతకాలు సాధించారని పాఠశాల యజమాన్యం తెలిపింది. తమ పాఠశాల విద్యార్థులు కటా విభాగంలో హిమన్య, కృష్ణపార్థు, చేతన్, జిష్ణుప్రకాశ్ ప్రథమ బహుమతులు సాధించారు. హిమాన్షిత్, రేవంత్ ద్వితీయ బహుమతి, సుజిత్ తృతీయ కుమితే విభాగంలో షఫీన్ ద్వితీయ బహుమతి సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి, అభినందించారు. భవిష్యత్ పోటీలలో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.

డంపింగ్ యార్డుకు మరోసారి కష్టాలు

జేసీబీకి ఒకే రోజు పగిలిన రెండు టైర్లు

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ డంపింగ్ యార్డుకు మరోసారి కష్టాలు వచ్చాయి. డంపింగ్‌యార్డులో చెత్తను సరిచేసే జేసీబీ వాహనానికి సరైన నిర్వాహణ లేక పోవటంతో రెండు నెలలుగా టైర్లు అరిగిపోయి ఇబ్బందిని ఎదుర్కొంటుంది. ఈక్రమంలో సోమవారం జేసీబీ రెండు టైర్లు ఒకటి తర్వాత మరోకటి పగిలిపోయాయి. దీంతో జేసీబి మూలనపడింది. డంపింగ్‌యార్డు నిర్వాహణ సమస్య ఏర్పడింది. వాస్తవానికి డంపింగ్‌యార్డు నిర్వాహణకుకు అధిక సామార్థ్యం కలిగిన యంత్రాలు అవసరం ఉంది. కాని కేఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఉన్న పాత కాలం నాటి వాహనాలను కూడా సరిగా నిర్వాహణ చేపట్టకపోవటం డంపింగ్ యార్డు సమస్యలకు తెరలేపుతోంది.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

ఖమ్మంలీగల్,జనవరి6(ఆంధ్రజ్యోతి): హైదరాబాదు దోమలగూడకు చెందిన తటారి ప్రమీలకు 6నెలల జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి పరిహారం కింద పది లక్షలు నిందితురాలు చెల్లించాలని ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ సోమవారం తీర్పుచెప్పారు. ఖమ్మం పట్టణం కవిరాజ్‌నగర్‌కు చెందిన భయ్యా సరోజ వద్ద తన కుటుంబ అవసరాల నిమిత్తం 2017లో రూ.10 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అనంతరం ఫిర్యాది రుణం తిరిగి చెల్లించమని ఒత్తిడి చేయగా నిందితురాలు 2019లో చెక్కు జారీచేసినది. బ్యాంకు ఖాతాలో జమ చేయగా నిందితురాలు తన బ్యాంకు ఖాతాను మూసివేసినట్లుగా బ్యాంకు వారు మెమో ఇవ్వటంతో ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీ చేశారు. కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేయగా కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం

ప్రియాంకగాంధీపై బీజేపీ నాయకుడి అనుచిత వ్యాఖ్యలకు నిరసన



దిష్టిబొమ్మను దహనం చేసి, నినాదాలు ఇస్తున్న మేయర్ నీరజ, కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌నేత, ఎంపీ ప్రియాంక గాంధీపై బీజేపీ మాజీ ఎంపీ రమేష్‌బిధూరి అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. సోమవారం జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సంజీవరెడ్డి భవన్ నుంచి పాత బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ చేశారు. బీజేపీ మాజీ ఎంపీ రమేశ్ బిధూరి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ బీజేపీ పార్టీకి మహిళలంటే కనీస గౌరవం లేదని ఆరోపించారు. బీజేపీ నాయకులు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ఢిల్లీ స్థాయి వరకు వెళ్లి నిరసన కార్యక్రమాలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. బీజేపీ నాయకులు పలుమార్లు మహిళలను కించపరిచేలా వ్యవహరించారని ఆరోపించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, పల్లేబోయిన భారతిచంద్రం, కన్నెం వైష్ణవిప్రసన్న, కాంగ్రెస్ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు దొబ్బల సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, మెక్కా శేఖర్‌గౌడ్, బొడ్డు బొందయ్య తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేసిన నూతక్కి

- ఎన్టీఆర్‌పేరుతో ఉచిత వైద్యశిబిరాలు
- బీవీకే ట్రస్టు కార్యదర్శి బండి రమేష్



గంగాధరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు

నేలకొండపల్లి,జనవరి6(ఆంధ్రజ్యోతి):సీపీఎం సీనియర్ నాయకుడు నూతక్కి గంగాధరరావు ఆశయ సాధనకు ఎన్టీఆర్ ఫౌండేషన్ పేరుతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు బీవీకే ట్రస్టు కార్యదర్శి, సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ అన్నారు. నూతక్కి గంగాధరరావు 36వవర్ధంతిని సోమవారం రావెళ్ళ భవన్‌లో నిర్వహించారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని కోదాడకు చెందిన ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నూతక్కి గంగాధరరావు సీపీఎం పట్ల విశ్వాసం,అంకితభావంతో పని చేసారన్నారు. పార్టీ ఉద్యమాలకే పరిమితం గాకుండా, సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించాలన్న ఉద్దేశ్యంతోనే ఉపాధి అవకాశాలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించటానికి అర్హులైన వారికి ఉచితంగా కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నూతక్కి భార్గవ, ఏటుకూరి రామారావు, బండిగుడవర్తి నాగేశ్వరరావు, బుగ్గవీటి సరళ, తోటవెంకట్రావ్,సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి, బీవీకె ట్రస్టు మేనేజర్ శ్రీనివాసరావు, నామా కార్తీక్, పగిడికత్తుల నాగేశ్వరరావు,మంకెన నర్సింహారావు, కట్టికోల వెంకన్న,మారుతి కొండలు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

కేఎంసీ ఎదుట నగర పాలకసంస్థ కార్మికుల ధర్నా



కేఎంసీ ఎదుట ధర్నా చేస్తున్న నగర పాలకసంస్థ కార్మికులు

ఖమ్మంటౌన్, జనవరి6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరపాలకసంస్థ కార్యాలయంలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సోమవారం నగరపాలకసంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ, టీయూసీఐ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెండో పీఆర్‌సీలో తమకు కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని నినాదాలు చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ విష్ణువర్ధన్,కళ్యాణం వేంకటేశ్వరరావు, టీయూసీఐ జిల్లా కార్యదర్శి జీ.రామయ్య, నాయకులు కే.శ్రీను మాట్లాడారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్ ఉద్యోగులు ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నా కనీస వేతనాలు లేవని, వారిని పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయటంలేదన్నారు. అనేక మున్సిపాలిటీలలో వేతనాలు నెలల తరబడి చెల్లించటం లేదని, కార్మికులు ఎలాబతకాలని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి, నూతన పీఆర్‌సీలో కనీసవేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో కార్మికసంఘాల నాయకులు జినుక శ్రీను, దొడ్ల నర్సింహారావు, వెంకటరమణ, బొల్లికొండ పద్మ, గురవయ్య, నారాయణ, తూరుగంటి వెంకటేష్ పాల్గొన్నారు.

పోస్టర్ ప్రజెంటేషన్‌లో మెడికల్ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, తదితరులు

ఖమ్మంకలెక్టరేట్,జనవరి6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కళాశాలల సమ్మేళన్‌లో ఖమ్మం మెడికల్ కళాశాల మెదటి ఏడాది విద్యార్థి ప్రతిభను కనపరిచారు. మెదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థి బి హిమవర్షిత్ పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రతిభ కనపరిచారు. ఆదివారం హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కళాశాలలో నిర్వహించిన ఈ సమ్మేళన్‌లో ఖమ్మం కళాశాల విద్యార్థి పోస్టర్ ప్రజెంటేషన్‌లో మూడో బహుమతిని సాధించాడు. దీంతో సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ సృజన, సదానందం, డాక్టర్ బాబూరత్నాకర్, డాక్టర్ బి కిరణ్‌కుమార్, డాక్టర్ తులసి, డాక్టర్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఖమ్మంలో ఐఎంఏలో నిర్వహించిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనపరిచిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ బాబూరత్నాకర్, డాక్టర్ సౌమ్యను ప్రిన్సిపాల్ సత్కరించారు.

‘రైతుభరోసా’ను వెంటనే ఇవ్వాలి



నేలకొండపల్లిలో నిరసన తెలుపుతున్న నాయకులు

నేలకొండపల్లి, జనవరి6(ఆంధ్రజ్యోతి): వెంటనే రైతు భరోసాను రైతుల ఖాతాల్లో వేయాలని, రుణం తీసుకున్న ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నేలకొండపల్లి వీఎస్సార్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య మాట్లాడుతూ ఎన్నో అలివి కాని హామీలనిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరుగ్యారెంటీల్లో ఒక్కదాన్ని సంపూర్ణంగా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ ఉద్యమిస్తుందని బ్రహ్మయ్య అన్నారు. కార్యక్రమంలో మరికంటి రేణుబాబు, మరికంటి ధనలక్ష్మి, షేక్.హుస్సేన్, గొలుసు రవి, నెల్లూరి లీలాప్రసాద్, కొండా కనకప్రసాద్, యాతాకుల భాస్కర్,కుక్కల సామేలు, కోటి సైదారెడ్డి పాల్గొన్నారు

ఎన్డీ ఆధ్వర్యంలో నిరసన

తిరుమలాయపాలెం: ఎన్నికల హామీలు అమలుచేయాలని రైతుభరోసా కింద రూ.15వేలు అందించాలని కోరుతూ మండలంలోని తిప్పారెడ్డిగూడెంలో న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపార్టీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రభుత్వం రైతుభరోసా కింద రూ.15వేలు ఇస్తామని చెప్పి రూ.12వేలు ఇవ్వడం అన్యాయమన్నారు. అర్హులైన రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఆపార్టీ నాయకులు అచ్చా ఉప్పలయ్య, జి.వీరస్వామి, గొర్రెపాటి రమేష్, పేరం వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మలీదు జగన్ స్మారక క్రికెట్ పోటీలు ప్రారంభం



ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి6(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీకార్పొరేటర్ మలీదు జగన్ యువతకు ఇచ్చిన ప్రోత్సాహాన్ని కొనసాగిస్తామని ఆయన కుమారుడు మలీదు మనీష్ పేర్కొన్నారు. సోమవారం 3వడివిజన్ బల్లేపల్లిలో మలీదు జగన్‌జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మనీష్ ప్రారంభించి మాట్లాడారు. ఈసందర్భంగా క్రీడాకారులు మలీదు జగన్‌కు రెండునిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. బల్లేపల్లి జగన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాల్సిందే

వంగూరి ఆనందరావు

ఖమ్మంరూరల్, జనవరి6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చట్టం అమలును నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు వంగూరి ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని తల్లంపాడులో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గ్రామ మహాసభను సోమవారం నిర్వహించారు. దేశంలోని పలు రాష్ట్రాలు సుప్రీంకోర్టు తీర్పును శిరసావహించి ఎస్సీవర్గీకరణను అమలు చేస్తుంటే తెలంగాణ రాష్ట్రం మాత్రం ఎస్సీ వర్గీకరణ అమలు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం నిర్వహించబోయే ప్రదర్శనను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో బొందయ్య, చింటూ, లెనిన్‌కుమార్, అనిల్, రఘు, వినయ్‌కుమార్, గణేశ్, రాములు, వెంకటేశ్వర్లు, నరసయ్య పాల్గొన్నారు.

కొణిజర్ల అధికారులతో జడ్పీ సీఈవో సమీక్ష

కొణిజర్ల,జనవరి6(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం మండలంలోని వివిధ శాఖాధికారులతో ఖమ్మం జడ్పీసీఈవో దీక్షా రైనా సమీక్ష నిర్వహించారు. మండలంలో అభివృద్ధి పనులపై సమీక్షించారు.

బీజేపీ కార్యాలయం ముట్టడి

ఖమ్మంచర్చికాంపౌండ్,జనవరి6(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని సోమవారం మాల మహానాడు సంఘాలు, పలు జేఏసీసంఘాల ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్రనాయకుడు గుంతేటి వీరభద్రం, లింగాల రవికుమార్, దామల్ల సత్యనారాయణం, కొరివి దయానంద్, కొట్టే సుధాకర్, గాదరి బాబు, దాసరి శ్రీనివాస్, పేరం మల్లయ్య, జమ్మి వీరబాబు పాల్గొన్నారు.



ఐద్వా సభ్యత్వ నమోదు

పెనుబల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) సభ్యత్వంలో 400మందిని చేర్పించినట్లు మండల కార్యదర్శి మిట్టపల్లి నాగమణి తెలిపారు. ఈ సభ్యత్వాన్ని లంకపల్లి, కొత్తలంకపల్లి, మండాలపాడు గ్రామాల్లో మహిళలను పలు అంశాలపై చైతన్యపరిచి సభ్యత్వాలను నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు మాదాసు నాగేశ్వరి, పద్మప్రియా, రజిని, రమణమ్మ, సరస్వతి, కృష్ణవేణి, చింతల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి నుంచి రూ.2.50లక్షల మంజూరు

ఏన్కూరు, జనవరి6(ఆంధ్రజ్యోతి): వైద్య ఖర్చులు లేక అనారోగ్యంతో బాధపడుతన్న బాధితుడికి వైద్యఖర్చులు నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ రూ.2.50లక్షలను మంజూరు చేయించారు. మండలంలోని ఆరికాయలపాడు గ్రామానికి చెందిన షేక్. అన్వర్‌బాషా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని గ్రామానికి చెందిన తోటకూరి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంటనే సీఎం సహాయ నిధికి సిఫార్సులు చేసి నిధులు మంజూరుచేయించారు. ఈనిధులతో బాధితుడు హైదరాబాదులో చికిత్స పొందుతున్నాడు. వైద్యఖర్చులకు సహాయం చేసిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు అన్వర్ తండ్రి మద్దిన్ కృతజ్ఞతలు తెలిపార.

గన్నీసంచుల కొరత

» కల్లాల్లోనే దర్శనమిస్తున్న వడ్లు
» సొసైటీల వద్ద సంచుల కోసం రైతుల పడిగాపులు



గన్నీసంచుల కోసం పూసలపాడు సొసైటీ వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

వైరా, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ధాన్యం రైతులను గన్నీసంచుల కొరత తీవ్రంగా వేధిస్తుంది. పౌరసరఫరాలశాఖ నుంచి అరకొరగా వస్తున్న గన్నీసంచులు ఏమూలకు సరిపోవడం లేదు. దాంతో రైతులు సహకార సంఘాల కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. వైరా మండలంలోని పూసలపాడు సొసైటీ పరిధిలోని నారపనేనిపల్లి గ్రామంలో 15వేల బస్తాల ధాన్యం తేమశాతం వచ్చినప్పటికీ గన్నీసంచులు లేని కారణంగా కాంటాలు వేయడం లేదు. అరకొరగా మిల్లర్ల నుంచి పంపించిన ఐదువేల బస్తాలు కూడా పురుగు పట్టి పనికిరాకుండా ఉన్నాయి. మంచిగా ఉన్న గన్నీసంచులు రైతులకు ఏమూలకు సరిపోని పరిస్థితి. దీంతో సోమవారం నారపనేనిపల్లికి చెందిన రైతులు పూసలపాడు సొసైటీ కార్యాలయానికి చేరుకొని గన్నీసంచుల కోసం పడిగాపులు కాశారు. వైరా, గరికపాడు సొసైటీలకు కూడా గన్నీసంచుల కొరత తీవ్రంగా ఉంది. డీసీఎంఎస్, ఐకేపీల ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాలకు కూడా అరకొరగానే గన్నీసంచులు సరఫరా అవుతున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతులను గన్నీసంచుల కొరత వేధిస్తోంది. ఓవైపున యాసంగి వ్యవసాయానికి సిద్ధమవుతున్న రైతులు ఖరీఫ్‌లో పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు గన్నీసంచులు లేని కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే పౌరసరఫరాలశాఖ అధికారులు అవసరాల మేరకు గన్నీసంచులు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి

● గాలి శ్రీనివాసరావు, పూసలపాడు సొసైటీ అధ్యక్షుడు



ధాన్యం కాంటాలు వేసేందుకు గన్నీసంచుల కొరత ఉంది. ఇప్పటికే తేమశాతం నిర్ధారించి కాంటా వేసేందుకు దాదాపు 20వేల బస్తాలు సిద్ధంగా ఉన్నాయి. గన్నీసంచులు లేక మూడురోజుల నుంచి కాంటాలు నిల్చిపోయాయి. సోమవారం ఐదువేల గన్నీసంచులు వచ్చినప్పటికీ చాలావరకు డ్యామేజీతో ఉన్నాయి. రైతులు పోటీపడటంతో వాటిని పంపిణీ చేయకుండా సొసైటీలోనే ఉంచాం. పూర్తిస్థాయిలో గన్నీసంచులు సరఫరా చేయాలి.

గన్నీసంచుల కోసం ఎదురుచూస్తున్నాం

● లక్ష్మారెడ్డి, రైతు, నారపనేనిపల్లి



గన్నీసంచులు లేక ధాన్యాన్ని కాంటా వేయలేదు. మూడురోజుల నుంచి గన్నీసంచుల కోసం సొసైటీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం. ఇప్పటికే తేమశాతాన్ని నిర్ధారించారు. కాంటా వేయడమే మిగిలి ఉంది. రోడ్లు, కల్లాల్లో ధాన్యం రాశులుగా పోసి ఉన్నాయి. వెంటనే గన్నీసంచులు అందించాలి.

కమ్యూనిస్టుల పోరాటాల వల్లనే సంక్షేమ పథకాలు

» సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు

కొణిజర్ల, జనవరి6(ఆంధ్రజ్యోతి): దేశంలో, రాష్ట్రంలో ప్రజలకు, అట్టడుగువారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే కమ్యూనిస్టుల పోరాటాల వలనేనని సీపీఐ జాతీయసమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. మండల పరిధిలోని తనికెళ్లలో సోమవారం జరిగిన తుల్లూరు పెద్దసత్యం వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తుల్లూరు సత్యం సేవలను పార్టీ ఎప్పటికి మరవదని తెలిపారు. పార్టీ పుట్టి 99సంవత్సరాలు పూర్తి అయింది. అందుకే శతజయంతి ఉత్సవాలు ఏడాదిపాటు నిర్వహించుకుంటున్నామన్నారు. కమ్యూనిస్టు పార్టీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటుందన్నారు. పేదవారికి భూమి ఇప్పించిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, అనేక పోరాటాల చేసి చట్టాలను మర్చించి ప్రజలకు అండగా నిలిచిందన్నారు. గ్రామీణ ఉపాధిచట్టం రావటానికి కమ్యూనిస్టు పార్టీనేనని తెలిపారు. అనంతరం నాయకులంతా సత్యం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యాసా వెంకటేశ్వరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జమ్ముల జితేందర్‌రెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, యర్రాబాబు, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, పోటు కళావతి, ఏపూరి లతాదేవి, గడల సీతారామయ్య, పీవీ రావు, ఎస్టీయుసంఘం నాయకులు గడల భాస్కర్‌రావు, లేడిబోయిన గోపాల్‌రావు, కొనపర్తి విష్ణుమూర్తి, నాయకులు గడల శ్రీను, పాపిట్ల ఏసు, పసుమర్తి శంకర్‌రావు, పిన్నం పుల్లయ్య పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి: సీపీఎం

ముదిగొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మచ్చా వీరయ్య భవనంలో జరిగిన మండల జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు సాధ్యం కాక కొత్త సమస్యలు సృష్టిస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారన్నారు. దేశంలో బీజేపీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతుందని దుయ్యబట్టారు. పంటలు పండించే ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు పూర్తి స్థాయిల్లో రుణమాఫీ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఉద్యమాల్లో కలిసిరావాలని కోరారు. కార్యక్రమంలో మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాల్‌రావు, జిల్లా నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, బండి పద్మ, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు టీఎస్.కల్యాణ్, రాయల శ్రీనివాసరావు, మంకెన దామోదర్, భద్రయ్య, నాగేశ్వరరావు, కోలేటి అరుణ, బట్టు రాజు, మెట్టెల సతీష్, మందరపు వెంకయ్య పాల్గొన్నారు.

'రైతు సమస్యలను విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు'

తల్లాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దేశానికి వెన్నెముక అయిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించండంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం తల్లాడలో సీహెచ్.విఠల్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 42రోజులుగా నిరాహారదీక్ష చేస్తున్న జగత్‌సింగ్ దల్లైవాల్‌కు ఏదైనా జరిగితే కేంద్రప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. దల్లైవాల్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ఆపార్టీ సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాచర్ల భారతి, డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, నాయకులు జాజిరి శ్రీనివాసరావు, తన్నీరు కృష్ణార్జున్ రావు, మాదాల వెంకటేశ్వరరావు, ఐనాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, శీలం పకీరమ్మ, సత్తెనపల్లి నరేష్ పాల్గొన్నారు.

న్యాయ సమాచార క్యాలెండర్ ఆవిష్కరణ

మధిర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): న్యాయ సమాచారంతో కూడిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలు రూపొందించడం అభినందనీయమని మధిర కోర్టు జూనియర్ సివిల్ జడ్జి టీ. కార్తీక్‌రెడ్డి అన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్, డైరీని ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఈ క్యాలెండర్‌ను రూపొందించిన సీనియర్ న్యాయవాది వాసంశెట్టి కోటేశ్వరరావును సన్మానించారు. ఈకార్యక్రమంలో ఏపీపీ జన్ను భద్రయ్య, సీనియర్ న్యాయవాదులు నంబూరి జనార్ధన్‌రావు, దిరిశాల జగన్ మోహన్‌రావు, కట్టా పూర్ణచంద్రరావు, సుంకు మోహన్‌దాసు, పల్లపోతు కృష్ణారావు, కావూరి రమేష్, కోట జ్ఞానేష్, తదితరులు పాల్గొన్నారు.

కళావేదిక నిర్మాణానికి వితరణ

మధిర రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో ప్రభుత్వ జిల్లాపరిషత్ హైస్కూల్లో కళావేదిక నిర్మాణం కోసం ఆగ్రామవాసి, సీవీఆర్ చిట్‌ఫండ్ అధినేత చెరుకూరి వెంకటేశ్వరరావు రూ.ఐదు లక్షలను వితరణ చేశారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కళావేదిక నిర్మాణానికి దాత చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. తన తల్లిదండ్రులైన చెరుకూరి నర్సయ్య, సుబ్బమ్మల జ్ఞాపకార్థం దీనిని నిర్మిస్తున్నట్లు దాత తెలిపారు. కార్యక్రమంలో మధిర మునిసిపల్ వైస్‌చైర్మన్ శీలం విద్యాలత, భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, శీలం వెంకటరెడ్డి, మొండితోక సుధాకర్, ముప్పా రామకృష్ణ, నీలం వెంకటేశ్వర్లు, హెచ్ఎం తోట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

» సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం

వైరా, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఉద్యమాలు నిర్వహిస్తుందని ఆపార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం పేర్కొన్నారు. సోమవారం మచ్చా మణి అధ్యక్షతన జరిగిన సీపీఎం వైరా పట్టణ కమిటీ సమావేశంలో వీరభద్రం మాట్లాడారు. మునిసిపాలిటీలోని సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తుందని అన్నారు. ప్రజలు ఉద్యమాల్లో కలిసిరావాలని కోరారు. పంటలు పండించే ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు పూర్తి స్థాయిల్లో రుణమాఫీ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, మాజీ ఎంపీపీ బొంతు సమత, జిల్లా కమిటీ సభ్యుడు సుంకర సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

పిల్లల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పిల్లల సామాజిక, భావోద్వేగం, శ్రేయస్సు కోసం ప్రీ-ప్రైమరీ విద్యను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. పైలట్ ప్రాజెక్టుగా సత్తుపల్లి పట్టణంలోని పాత సెంటర్ ప్రాథమిక పాఠశాల ఎంపికవ్వగా ప్రీ-ప్రైమరీ ఎడ్యూకేషన్ క్లాస్‌ను ను ఆమె ప్రారంభించారు. ఎల్‌కేజీ, యూకేజీ, నర్సరీ విద్యను దృష్టిలో ఉంచుకుని పిల్లల కోసం ఈ క్లాసులను నిర్వహిస్తుందన్నారు. చిన్న పిల్లలకు శ్రద్ధగల, ఆకర్షణీయమైన వాతావరణాన్ని సృష్టించడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని, వారికి బాల్యవిద్యపై ఆసక్తి కలిగే మీరంతా అంకితభావంతో పనిచేసి వారి భవిష్యత్తుకు ఉత్తమ పునాది వేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, ఐసీడీఎస్ సీడీపీవో కనకదుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలి: జడ్పీ సీఈవో



వివరాలు సేకరిస్తున్న జడ్పీ సీఈవో దీక్షారైనా

కొణిజర్ల, జనవరి6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని జడ్పీ సీఈవో దీక్షా రైనా అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం మండలంలోని వివిధ శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు గురించి అవరమైన పనులు గురించి అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తఫ్జల్ హుస్సేన్, ఎంపీడీవో రోజారాణి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి యూత్ ఫెస్టివల్‌లో క్రాంతి విద్యార్థుల ప్రతిభ

వైరా, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మంజిల్లాస్థాయిలో కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ పక్షాన ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన యువజనోత్సవాల్లో వైరా క్రాంతి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. జూనియర్ విభాగం వ్యాసరచన పోటీల్లో జాలాది అనూష ప్రథమ బహుమతి, పెట్రాటిక్ పోయంలో షేక్.నగీన ప్రథమ, రంగోళి పోటీల్లో కె.తిరుపతమ్మ ద్వితీయ, పోస్టల్ పెయింటింగ్‌లో నిఖిలేంద్ర ద్వితీయ, క్విజ్ పోటీల్లో షేక్.రియాజ్, భాగ్యలక్ష్మీ, విష్ణు తృతీయ, ఎలక్ట్రీషియన్ పోటీల్లో ప్రవీణ్ తృతీయ బహుమతులు సాధించారు. ఈ విద్యార్థులను ఠాగూర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, చైర్మన్ వాసిరెడ్డి సునీత, డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ఎన్ఎస్ఎస్ పీవో లింగారావు, ప్రిన్సిపల్ కృష్ణారావు అభినందించారు.

డిమాండ్స్ డే ధర్నాను జయప్రదం చేయండి

వైరా, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యలపై ఈనెల తొమ్మిదో తేదీన ఖమ్మం కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకుడు పాశం అప్పారావు పిలుపునిచ్చారు. సోమవారం వైరాల్లో విలేకరులతో మాట్లాడుతూ రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ధర్నా ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. ఈ కా ర్యక్రమంలో కె.అర్జున్‌రావు, యలదండి బాబు, కె.దర్గయ్య పాల్గొన్నారు.

సత్తుపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు న్యాయం చేయాలని డిమాండ్‌తో ఈనెల 9న కలెక్టరేట్ వద్ద నిర్వహించే రైతాంగ డిమాండ్స్ డే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం సత్తుపల్లిలోని నీలం రామచంద్రయ్య భవనంలో పోస్టర్లను ఆవిష్కరించారు. రైతు రుణమాఫీ సమగ్రంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ సిఫార్సులను ప్రభుత్వం అమలు చేయడం లేదని కార్యక్రమంలో ఒగ్గు నాగిరెడ్డి, మాచినేని వెంకట నరస య్య, గంటా శ్రీనివాసరావు, బలగాని శ్రీను, విశ్వనాథం పాల్గొన్నారు.

'కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి'

మధిరటౌన్, జనవరి6(ఆంధ్రజ్యోతి): మధిరలోని హిందూ శ్మశానవాటిక స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ వార్డు కౌన్సిలర్ కోనా ధనికుమార్ మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్‌కు సోమవారం వినతిపత్రం అంద జేశారు. మధిరలోని ఆజాద్ రోడ్డు చివరలో ఉన్న ప్రభుత్వ నాలాతో పాటు హిందూ శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించుకోని రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు మాగం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

మధిరలో పలువురి ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలని సీపీఐ జిల్లా నాయకుడు బెజవాడ రవి తహసీల్దార్ రాంబాబుకు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి వెంకటేశ్వరావు, రామాంజనేయులు, ఊట్ల కొండల్‌రావు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ ధనికుమార్

ఇందిరమ్మ ఇండ్ల జాబితా పరిశీలన

కల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) కల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం ఇందిరమ్మ ఇండ్ల అన్హరత కలిగిన ఇండ్ల జాబితాలను హౌసింగ్ పీడీ శ్రీనివాస్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల యాప్ నందు అనర్హత కలిగిన 360 డిగ్రీలో నమోదైన ఇండ్ల జాబితాలను క్షేత్ర స్థాయిలో పీడీ సమగ్రంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరావు, పంచాయతీ ఈవో ఎన్ నాగేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, బిల్‌కలెక్టర్లు లక్కినేని ప్రవీణ్, కె. వెంకటయ్య, కట్టా నరిసింహారావు, పాగా శ్రీనివాసరావు, జి. వేణు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాలు

పెనుబల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ముత్తగూడెం చెక్‌పోస్టు వద్ద హెల్మెట్, సీట్‌బెల్టు ధరించి వాహనాలను నడపాలని చెక్‌పోస్టు ఎంవీఐ విజయశాంతి కోరారు. డ్రైవర్లు, వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్, సిగ్నల్స్‌పై అవగాహన కల్పించి రోజాపూలు అందజేసి రోడ్డు భద్రత అందరి బాధ్యత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సీహెచ్.వెంకటేశ్వరరావు, నిచ్చెల సాహేల్, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులకు గులాబీపూలు అందజేస్తున్న ఎంవీఐ విజయశాంతి

పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

» మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు



చింతకానిలో మాట్లాడుతున్న కమల్‌రాజు

చింతకాని, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటినా 6 గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామంలో సోమవారం స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కొండబాల కోటేశ్వరరావు, మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, మంకెన రమేష్, తాతా ప్రసాద్‌రావు, బొడ్డు వెంకటరామారావు, గురిజాల హనుమంతరావు, సామినేని అప్పారావు, వేముల నర్సయ్య, ఆళ్ల పానకాలరావు, చాట్ల సురేష్ పాల్గొన్నారు.

అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కూరపాటి అనంతరాజుకు వినతి పత్రం సమర్పించారు.

వేంసూరులో...

వేంసూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతుభరోసా కింద రూ.15వేలు ఇస్తామని నమ్మబలికి నేడు రూ.12వేలు ఇస్తామని ప్రకటించటం సిగ్గుచేటని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. తహసీల్దార్ ఎంఏ. రాజుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో దొడ్డా వెంకటకృష్ణారెడ్డి, కంటే వెంకటేశ్వరరావు, పుచ్చకాయల శంకర్‌రెడ్డి, నల్లమోతు ప్రసాద్, మారోజు సురేష్, గండ్ర సోమిరెడ్డి, ఎం.శ్రీధర్, కుక్కపల్లి సుధాకర్, నూనె హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లిలో...

పెనుబల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ గంటా ప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం మండలంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కనగాల వెంకట్రావ్, కనగాల సురేష్‌బాబు, కోటగిరి సుధాకర్‌రావు, చెక్కిలాల లక్ష్మణ్‌రావు, కొప్పుల గోవిందరావు, మందడపు అశోక్‌కుమార్, లక్కినేని వినీల్ పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్‌లో..

సత్తుపల్లిరూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఎన్నికల సమయంలో ఇచ్చిన వరంగల్ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని సత్తుపల్లి మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎస్‌కే. రఫీ, కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, కూసంపూడి రామారావు, చాంద్‌పాషా, నడ్డి ఆనందరావు, ఆయూబ్‌పాషా, మోరంపూడి శ్రీను, పర్వతనేని వేణు, ఎర్రబాబు, చింతల సురేందర్‌రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో ...

కల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నాయకత్వంలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కట్టా అజయ్‌కుమార్, బీరవల్లి రఘు, లక్కినేని రఘు, పెడకంటి రామకృష్ణ, కాటంనేని వెంకటేశ్వరరావు, యస్‌కె కమ్లి, మేకల కృష్ణ, కొరకొప్పు ప్రసాద్ పాల్గొన్నారు.

ముదిగొండలో...

ముదిగొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ హయాంలో సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, పోట్ల వెంకటప్రసాద్, బంకా మల్లయ్య, కోటి అనంతరాములు, గడ్డం వెంకట్, ఖాజా పాల్గొన్నారు.

మధిరటౌన్....

మధిరటౌన్, జనవరి6(ఆంధ్రజ్యోతి): ప్రతి ఎకరాకు రైతు భరోసా కింద రూ.15వేలు ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు మధిర తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ తీరుకు తమ నిరసన తెలిపారు. వరంగల్ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తా రు నాగేశ్వరరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, అరిగె శ్రీను, వై.వీ.అప్పారావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేంసూరులో తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ముదిగొండలో..



కల్లూరులో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు